



స్వాధీనం చేసుకున్న నాటుబాంబులు

నాటుబాంబుల కలకలం

● మణిపిరెడ్డిపల్లెలో 26 స్వాధీనం ● పోలీసుల అదుపులో ఇద్దరు

పాకాల, ఆగస్టు 11: పాకాల మండలంలోని చెన్నుగారిపల్లె పంచాయతీ మణిపిరెడ్డిపల్లెలో నాటుబాంబులు కలకలం సృష్టించాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మణిపిరెడ్డిపల్లె రైల్వేగేటు సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఓ ఇంట్లో ఆదివారం 26 నాటుబాంబులను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటిని తయారు చేస్తున్న బాబు, గజేంద్రలను అదుపులోకి తీసుకున్నారు. పందుల పెంపకంతో జీవనం సాగిస్తున్న వీరు అడవి పందులను వేటాడడానికి నాటుబాంబులు తయారు చేస్తున్నట్లు చెబుతున్నారు. గుండ్రంగా ఉండే ఈ బాంబులను అడవి పందులు సంచరించే ప్రదేశాల్లో పెడతారు. అవి తినడానికి ప్రయత్నించినపుడు పేలి అడవి పంది ముఖం ఛిద్రమవుతుంది. ఆ తర్వాత పందిని స్వాధీనం చేసుకుని, దాని మాంసాన్ని వీరు విక్రయిస్తున్నట్లు తెలిసింది. పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





నిందితులు గజేంద్ర, బాబు

ధాన్యంలో దళారుల దందా



కల్తీ కాకుండా ఏదీ లభించే పరిస్థితి కనిపించడం లేదు. నాణ్యత కోసం వెతుకులాడుకునే పరిస్థితి వచ్చేసింది. చివరికి తినే అన్నం సైతం కల్తీ చేస్తున్నారు. ఆపై మధ్య తరగతి జనాలే లక్ష్యంగా దళారులు మోసం చేస్తున్నారు.

- పెళ్లకూరు/తడ

● 'బీపీటీ' రకంలో 'ఎన్ఎల్ఆర్'తో కల్తీ

● మధ్య తరగతి జనమే లక్ష్యంగా మోసం

ఒకప్పుడు నెల్లూరు మొలగొలుకులు ఫేమస్. ఆరు నెలల పాటు రైతు శ్రమించి దిగుబడి చేసే ధాన్యం రకమది. దీనిపై అన్నివర్గాల వారు మక్కువ చూపేవారు. తర్వాత సన్నరకాలకు గిరాకి వచ్చింది. అందులో ముఖ్యమైంది బీపీటీ 5224 (బాపట్ల జిలకర) ధాన్యం. ఈ పంట కేవలం 90 రోజుల నుంచి వంద రోజుల్లోపు రైతు చేతికి వస్తుంది. తినేందుకు తియ్యగా.. తృప్తిగా అనిపించే రకం ధాన్యం. ప్రస్తుతం ఈ రకం ధాన్యం ధర పుట్టి రూ.26,450. ఈ రకానికి మార్కెట్లో గిరాకి ఏర్పడింది. ఇటీవల బీపీటీలను పోలిన ఎన్ఎల్ఆర్ 3449 (నెల్లూరు జిలకర) రకం ధాన్యం అందుబాటులోకి వచ్చింది. ఈ ధాన్యం 80 రోజుల్లోనే చేతికొస్తుంది. పైగా ఎటువంటి తెగుళ్లకు ఆస్కారం లేకుండా రైతు ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుంది. నాణ్యత అంతంత మాత్రమే. రుచి ఉండకపోవడంతో ఎవరూ ఇష్టపడడం లేదు. ధరల్లో సైతం భారీ వ్యత్యాసం ఉంటుంది. ప్రస్తుతం ఎన్ఎల్ఆర్ 5224 పుట్టి ధర రూ.14,950గా ఉంది. అంటే బీపీటీ రకాలకు, ఎన్ఎల్ఆర్ 5224 రకం ధాన్యానికి మధ్య వ్యత్యాసం సుమారు రూ.11,500గా ఉంది. ఇదే దళారులకు, మిల్లర్లకు అవకాశంగా మారింది.

వ్యత్యాసం గుర్తించడం కష్టం

బీపీటీ, ఎన్ఎల్ఆర్ రకాలు చూసేందుకు ఒకేలా ఉంటాయి. రైతులకు, మిల్లర్లకు తప్ప అందులో వ్యత్యాసం గుర్తించడం కష్టం. దీనికితోడు ఈ రెండు రకాల ధాన్యాలను ఆడించి బియ్యం చేస్తే ఇక ఎవ్వరూ కనిపెట్టలేరు. ఇదే దళారులకు అనుకూలమైంది. రైతుల నుంచి రెండు రకాల ధాన్యాలను కొనుగోలు చేసే దళారులు, మిల్లర్లు కొన్ని ప్రదేశాల్లో ఈ రెండు రకాల ధాన్యాలను కలబోస్తారు. మూడు వంతుల బీజీటీ రకం ధాన్యంలో ఓ వంతు ఎన్ఎల్ఆర్ రకాన్ని కల్తీ చేసి విక్రయిస్తున్నారు. తద్వారా ఎన్ఎల్ఆర్ రకానికి కూడా బీపీటీ ధాన్యం ధరనే దళారులు వసూలు చేస్తున్నారు. ఈ దందా సూళ్లూరుపేట నియోజకవర్గంలోని సూళ్లూరుపేట, దొరవారి సత్రం, పెళ్లకూరు మండలాల్లో భారీ ఎత్తున జరుగుతున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలొస్తున్నాయి.


నగరపాలక అధికారులపై 'విజిలెన్స్'

టీడీఆర్ బాండ్ల జారీ, నిధులు దుర్వినియోగం చేసిన అధికారుల్లో గుబులు

విచారణకు ఆదేశించిన మంత్రి నారాయణ



తిరుపతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పాలక సంస్థలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారులపై విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తూ మంత్రి నారాయణ ఆదేశించారు. ఆమేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి విభాగపు స్పెషల్ చీఫ్ సెక్రటరీకి లిఖితపూర్వక ఆదేశాలిచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతి నగరపాలక సంస్థలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రజాదర్బార్ (ఆర్జీజీ)లో భాగంగా మంత్రి నారా లోకేశ్‌కు టీడీపీ నేతలు ఫిర్యాదులు చేశారు. ఈక్రమంలో మంత్రి నారాయణకు తిరుపతి కార్పొరేషన్లోని అవినీతి అధికారుల గుట్టు విప్పాలని మంత్రి లోకేశ్ ద్వారా ఫిర్యాదులు వెళ్లాయి. దాంతో విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తూ నారాయణ నిర్ణయం తీసుకోవడంతో అవినీతి అధికారుల్లో గుబులు పట్టుకుంది. తిరుపతిలో జరిగిన ట్రాన్స్‌ఫర్‌బుల్ డెవలప్‌మెంట్ రైట్ (టీడీఆర్) బాండ్ల కుంభకోణం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. రూ.4వేల కోట్ల టీడీఆర్ బాండ్ల కుంభకోణం జరిగినట్టు అప్పట్లో ప్రతిపక్ష టీడీపీ నేతలు ఆరోపించారు. అభివృద్ధి పేరుతో తుడా వేయాల్సిన మాస్టర్ ప్లాన్ రోడ్లను పక్కా ప్రణాళికతో తెరపైకి తీసుకొచ్చి స్థలాలు కోల్పోయిన వారి పేర్లతో బాండ్లు తీసుకుని కోట్లు కొల్లగొట్టారు. అగ్రికల్చర్, రెసిడెన్షియల్ పరిధిలోని స్థలాలను కూడా కమర్షియల్‌గా రిజిస్ట్రేషన్ విలువ పెంచేసి భారీగా లబ్ధి పొందారు. వైసీపీ నేతల జేబుల్లోకి దాదాపు రూ.400 కోట్ల వరకు వెళ్లినట్టుగా ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగంలో ఇష్టానుసారంగా నిధులు దుర్వినియోగమయ్యాయన్న విమర్శలూ ఉన్నాయి. ఇక గత ప్రభుత్వంలో వైసీపీ నేతలతో అంటకాగిన అధికారులపై కూడా విచారణ జరగనున్నట్టు తెలుస్తోంది.





19న శ్రీసిటీకి సీఎం చంద్రబాబు

రేపు షార్‌కు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాక

తడ, ఆగస్టు 11: ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈనెలలో జిల్లాలో విడివిడిగా పర్యటించనున్నారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్)లో మంగళవారం జరగనున్న అంతరిక్ష దినోత్సవాల్లో పాల్గొనడానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రానున్నారు. తిరుపతి విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో వచ్చి అక్కడినుంచి హెలికాప్టర్‌లో శ్రీహరికోటకు చేరుకుంటారు. అక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి హెలికాప్టర్‌లో విమానాశ్రయానికి చేరుకుంటారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 19వ తేదీన శ్రీసిటీకి రానున్నారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఆహ్వానం మేరకు ఆయన సెజ్‌లో పర్యటించేందుకు సమ్మతించారు. ఆ రోజంతా ఆయన శ్రీసిటీలోనే ఉండనున్నట్లుగా సమాచారం. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి జిల్లాకు రానుండటంతో అధికారులు భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వీరి పర్యటనకు సంబంధించి అధికారిక సమాచారం అందిందని.. ఏర్పాట్లు చేస్తున్నామని సూళ్లూరుపేట ఇన్‌చార్జి ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు.

నేటినుంచి హర్ ఘర్ తిరంగా

తిరుపతి (విద్య), ఆగస్టు 11: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని సోమవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు జిల్లాలో ఘనంగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. 'సోమవారం జిల్లా, మండల, గ్రామ, వార్డు పరిధుల్లో హర్ ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించాలి. అర్బన్ పరిధిలో మున్సిపల్ కమిషనర్లు, మండలాల్లో ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీ పరిధిలో డీపీవో, స్పోర్ట్స్, ఎన్‌వైకే, విద్యాశాఖ పర్యవేక్షించాలి. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో దేశభక్తి గీతాలు నిర్వహణ, పేట్రియాటిక్ డ్రామాలు, మోనో యాక్షన్ ప్రదర్శనలు తదితర కార్యక్రమాలను చేపట్టాలి. డీఆర్‌డీఏ, మెప్మా వారు ఎస్‌హెచ్‌జీ భాగస్వామ్యంతో జెండాల విక్రయాలతో స్టాల్స్‌ను నిర్వహించాలి. 13వ తేదీన డీఎస్‌డీవో, డీఈవో కలిసి సమన్వయంతో బిగ్‌రన్ మారథాన్ నిర్వహించాలి. 14న జాతీయ జెండాలతో 'హర్‌ఘర్‌తిరంగా.కామ్' లింక్ ద్వారా సెల్ఫీలు తీసుకుని పోస్ట్ చేయాలి. మున్సిపల్ కమిషనర్, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబీకులను గౌరవించాలి. 15వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేయాలి' అని కలెక్టర్ ఆదేశాలిచ్చారు. అన్నిశాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.

20నుంచి ఓటర్ల జాబితా
సవరణ షురూ

● ఓటరుగా నమోదుకు యువతకు అవకాశం

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 11: జిల్లాలో ఈనెల 20వ తేదీ నుంచి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. అలాగే 18-19 సంవత్సరాల యువతను కొత్త ఓటరుగా నమోదుకు భారత ఎన్నికల కమిషన్ అవకాశమిచ్చింది. ఈనెల 20 నుంచి అక్టోబరు 18వ తేదీ నాటికి సవరణ ప్రక్రియ పూర్తి చేసి, అదేనెల 29న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సమాచారాన్ని ధ్రువీకరించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఓటర్ల జాబితాల్లో పొరపాట్లను గుర్తించి తొలగించడం, ఫొటోల నాణ్యతను మెరుగుపరచడం, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ చేయనున్నారు. అక్టోబరు 19 నుంచి 28వ తేదీవరకు 1 నుంచి 8 వరకు ఫారాల తయారీతో పాటు వచ్చే ఏడాది జనవరి ఒకటోతేదీ నాటికి సమగ్రమైన డ్రాఫ్ట్ రోల్స్ సిద్ధం చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. అలాగే ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, ఇతర క్లెయిమ్‌లు నవంబరు 28వ తేదీ వరకు స్వీకరిస్తారు. ఈ ఏడాది డిసెంబరు 24వ తేదీ నాటికి అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిష్కరిస్తారు. తుది ఓటర్ల జాబితాను వచ్చే ఏడాది జనవరి 6న ప్రచురించనున్నారు.

ఈసారైనా దొంగ ఓట్లను తొలగిస్తారా..?

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైసీపీ బరితెగించి బీఎల్వోలు, ఇతర అధికారుల సహకారంతో ఇబ్బడి ముబ్బడిగా దొంగ ఓట్లను చేర్పించడం, డెడ్, షిఫ్టెడ్ ఓట్లను తొలగించలేదన్న విమర్శలు వచ్చాయి. అప్పట్లో ఈ అంశాలపై కూటమి నేతలు కేంద్ర ఎన్నికల సంఘానికి పలుమార్లు ఫిర్యాదులు కూడా చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 20 నుంచి చేపట్టబోయే ప్రక్రియలోనైనా దొంగ ఓట్లను తొలగించాలని వారు కోరుతున్నారు. ఏడు నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ సమయానికి మొత్తం 18,12,980మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 8,83,330 మంది, మహిళలు 9,29,466మంది,ఇతరులు 184మంది ఉన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా ఓటర్ల సవరణ ప్రక్రియ నిర్వహిస్తే ఓటర్ల సంఖ్య తగ్గే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా చంద్రగిరి, తిరుపతిలో అత్యధికంగా దొంగ ఓట్లు నమోదైన విషయం బహిరంగ రహస్యమే. ఈ విషయాలపై కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టి సారించాల్సి ఉంది.

తిరుపతిలో విషాద ఛాయలు

● తిరుత్తణి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు నగరవాసుల దుర్మరణం

చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణికి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం చెందారు. వీరిలో చేతన్ (21), యుగేష్ (21) తిరుపతికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. ఈ విషయం తెలియడంతో తిరుపతిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చెన్నై కళాశాలలో వీరు కంప్యూటర్ ఇంజనీరింగ్ చదువుతున్నట్లు సమాచారం. యుగేష్ ప్రస్తుతం డిస్‌కంటిన్యూ చేసినట్లు తెలిసింది. గాయపడ్డ వారిలో గూడూరు న్యూ బాలాజీ నగర్‌కు చెందిన శ్రీనివాసన్ కుమారుడు విష్ణు ప్రస్తుతం తిరువళ్లూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

వీఆర్వోల ప్రైవేట్ గదుల్లో రికార్డులు

● వాటి భద్రతపై అనుమానాలు ● రేణిగుంట విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ల రూటే సపరేటు

తిరుపతి- ఆంధ్రజ్యోతి

రేణిగుంట మండల పరిధిలోని వీఆర్వో (విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్)ల వ్యవహారశైలిపై విమర్శలు వస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయం కాదని సొంతంగా అద్దె గదులను తీసుకుని ఎక్కువ సమయం అక్కడే ఉంటారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక వారి పంచాయతీకి సంబంధించిన రెవెన్యూ రికార్డులను అక్కడే ఉంచుకున్నట్టు తెలుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులకు ఖాళీగా ఉన్న రెవెన్యూ, వివాదాస్పద భూముల పత్రాలను చూపించి వారి కబ్జాకు సహకరించారన్న ప్రచారం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ప్రైవేట్ గదులను వదిలి పెట్టడంలేదని తెలుస్తోంది. సోమవారం మాత్రం ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమయంలో ఓ గంటపాటు ఉండి తక్కిన సమయం ఆ గదుల్లోనే ఉంటూ సేద తీరుతుంటారని సమాచారం. వారికోసం ఎవరొచ్చినా తహసీల్దార్ కార్యాలయం కాకుండా సొంత కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. తొలుత అక్కడ 'సెటిల్' చేసుకుంటేనే తహసీల్దార్ కార్యాలయం వరకు ఫైలు కదులుతుందన్న ఆరోపణలు పెద్దఎత్తున ఉన్నాయి. ఇవి అటుంచితే రెవెన్యూ రికార్డుల భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేట్ గదుల్లో ఎక్కడపడితే అక్కడ రికార్డులు, పత్రాలు పడి ఉన్నాయి. ముఖ్యమైన రికార్డులు కనిపించకపోయినా, ఎవరైనా అపహరించినా బాధ్యత ఎవరిదంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



రేణిగుంటలోని వీఆర్వోల ప్రైవేట్ కార్యాలయంలో ఉన్న రికార్డులు

● కుప్పం మహిళా రైతు

'ఎర్రకోట' వేడుకలకు అతిథి

ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగే పంద్రాగస్టు వేడుకలకు కుప్పం మహిళా రైతు ఎన్.మునిలక్ష్మి అతిథిగా హాజరు కానున్నారు. కుప్పం మండలం వెండుగంపల్లెకు చెందిన ఈమె పీఎం కిసాన్ పథకం లబ్ధిదారు. తన భర్త నారాయణతో కలిసి గ్రామంలో ఆమె ఆదర్శ వ్యవసాయం చేస్తున్నారు. కాగా, ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్యదిన వేడుకలకు రాష్ట్రం నుంచి పీఎం కిసాన్ లబ్ధిదారులైన నలుగురు రైతులను అతిథులుగా ఎంపిక చేశారు. వీరిలో చిత్తూరు ఉమ్మడి జిల్లా నుంచి మునిలక్ష్మి ఉన్నారు. మిగిలిన వారు.. పోతుల నాగమణి (ఏలూరు), దోమ మోహన్ (శ్రీకాకుళం), నల్లపు మాల్యాద్రి (ప్రకాశం). కాగా ఎన్.మునిలక్ష్మి దంపతులు ఆదివారం సాయంత్రం కుప్పంనుంచి విజయవాడ బయలుదేరి వెళ్లారు. అక్కడ్నుంచి దురంతో ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి న్యూఢిల్లీ చేరుకుంటారు. ఎర్రకోట వద్ద జరిగే స్వాతంత్ర్య దిన వేడుకల్లో అతిథిగా పాల్గొంటారు. మునిలక్ష్మి దంపతులకు టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు మల్లానూరు ప్రేమ్‌కుమార్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

- కుప్పం



విజయవాడ బయలుదేరిన మునిలక్ష్మి దంపతులు



నాగేంద్రబాబు - (ఇన్‌సెట్‌లో) వీపులో దిగివున్న కత్తి

జాతరలో బీభత్సం

● శ్రీకాళహస్తిలో అర్ధరాత్రి కత్తులతో దాడులు

శ్రీకాళహస్తి,ఆగస్టు11: శ్రీకాళహస్తి పట్టణం తెట్టు కూడలి వద్ద గంగమ్మ నిమజ్జనం సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి 12.30 గంటలకు రెండు వర్గాల మధ్య పాత కక్షలు భగ్గుమన్నాయి. కత్తులతో పరస్పరం దాడులకు దిగడంతో భీతావహ వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు జాతర వేడుక జరిగింది.రాత్రి అమ్మవారి నిమజ్జనం సమయంలో స్థానికంగా ఉన్న ఇద్దరు యువకుల వర్గాల మధ్య పాతకక్షలు భగ్గుమన్నాయి. దాంతో కత్తులతో పరస్పరం దాడులకు దిగారు. ఈ దాడుల్లో నాగేంద్రబాబు(40), సాయికృష్ణ(30) తీవ్రంగా గాయపడ్డారు.నాగేంద్రబాబు వీపుపై ఎడమ భుజం వద్ద గుండెవైపుగా కత్తి దిగబడింది. సాయికృష్ణకు తలపై కత్తిపోట్లు పడ్డాయి. రెండో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఇద్దరినీ ప్రథమ చికిత్స అనంతరం 108 అంబులెన్స్‌లో తిరుపతి రుయాకు తీసుకెళ్లారు.



తలపై గాయంతో సాయికృష్ణ

చంద్రగిరి

ఆ హాట్ సీట్లపైనే పలువురు సీఐల ఆసక్తి

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 11: జిల్లాలో సీఐల బదిలీలు రెండుసార్లు జరిగినా కొన్ని స్థానాలపై పలువురు సీఐలు ఆసక్తి చూపుతున్నారు. వీటిల్లో తిరుపతి ఈస్ట్, తిరుమల వన్‌టౌన్, టూటౌన్, తిరుపతి వెస్ట్, చంద్రగిరి, పాకాల, భాకరాపేట సర్కిళ్లను హాట్ సీట్లుగా పోలీసు వర్గాలు భావిస్తుంటాయి.వీటిల్లో ఒక్కో సర్కిల్‌కి దాదాపు నలుగురు చొప్పున పోటీపడుతున్నట్లు సమాచారం. అత్యంత డిమాండు ఉన్నది ఈస్ట్ సర్కిల్. దీని పరిధి కూడా ఎక్కువే. తిరుమలకూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఎవరికి పోస్టింగ్ ఇవ్వాలన్న దానిపై అధికారులకు తలనొప్పిగా మారింది. కాగా, అనధికార సమాచారం మేరకు.. తిరుపతిలోని ఎస్వీయూనివర్సిటీ సీఐగా పనిచేస్తున్న మురళీమోహన్‌కు తిరుమల టూటౌన్ ఖరారైనట్లు తెలుస్తోంది. కొండపై వన్‌టౌన్ సీఐగా ఉన్న విజయకుమార్‌కు బదిలీ లేనట్లు సమాచారం.

తిరుమల డీఎస్పీగా విజయ్‌శేఖర్ బాధ్యతల స్వీకరణ



తిరుమల, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): తిరుమల లా అండ్ అర్డర్ డీఎస్పీగా విజయ్‌శేఖర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఎస్పీగా ఉన్న శ్రీనివాసాచారి స్థానంలో ఆయన్ను నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులు వచ్చిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఆయన ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. విజయ్‌శేఖర్ గతంలో తిరుమల ఎస్ఐగా, 2012-16 మధ్య సీఐగా పనిచేశారు. ఆ తర్వాత ఏసీబీలో పనిచేశారు. 2020లో డీఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన చిత్తూరు. తిరుపతి, కర్నూలులో పనిచేశారు. అక్కడి నుంచి తిరుమల డీఎస్పీగా బదిలీ అయ్యారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనిచేస్తానని విజయ్‌శేఖర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. పటిష్ఠ భద్రత కల్పించడంతోపాటు దళారీలను అరికట్టడంపై దృష్టి పెడతానన్నారు.

కావలివారిపల్లెలో ఘనంగా పశువుల పండుగ



కావలివారిపల్లెలో జల్లికట్టు ప్రారంభిస్తున్న పులివర్తి వినీల్

పాకాల, ఆగస్టు 11: మండలంలోని కావలివారిపల్లెలో ఆదివారం పశువుల పండుగ ఘనంగా నిర్వహించారు. పశువుల కొమ్ములకు రంగులు వేసి అలంకరించి పూజలు చేసి గ్రామంలో ఊరేగించారు. కోడెగిత్తల కొమ్ములకు బహుమతులు కట్టి వీధుల్లో జల్లికట్టు నిర్వహించారు. కోడెగిత్తలను నిలువరించి బహుమతులు దక్కించుకోవడానికి యువత పరుగులు తీశారు. స్వల్పగాయాలను సైతం లెక్కచేయకుండా హుషారుగా కోడెగిత్తల వెంట పడ్డారు. ఎమ్మెల్యే పులివర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ పశువుల పండుగలో ముఖ్య అతిథిగా పాల్గొని కొబ్బరికాయలు కొట్టి పూజలు చేసి జల్లికట్టు ప్రారంభించారు. కార్యక్రమంలో కె.సావిత్రి, బి.మహేష్ కుమార్, బి.ఈశ్వరచౌదరి, చెంగల్రాయులు, ఫల్గుణ, శశిధర్, వేణు, రమణ, కె.ప్రభాకర్ నాయుడు, గుణశేఖర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ కామేశ్వర్ మృతికి సంతాపం



పాకాల, ఆగస్టు 11: స్థానిక రామకృష్ణ మందిరం వీధిలో నివాసమున్న సీనియర్ జర్నలిస్ట్ ఈ..కామేశ్వర్ గుండెపోటుతో మంగళవారం మృతిచెందారు. ఆదివారం ఆయన ఇంటివద్ద కామేశ్వర్ చిత్రపటానికి స్థానిక మీడియా మిత్రులు, సీపీఎం, కేవీపీఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దుర్గసముద్రంలో ముగిసిన మహాభారత ఉత్సవం



తిరుపతి రూరల్, ఆగస్టు 11: తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంలోని ధర్మరాజస్వామి ఆలయంలో 12రోజులపాటు నిర్వహించిన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి మహాభారత ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు చెల్లించారు. భక్తులకు అన్నదానం చేశారు. శ్రీవేంకటేశ్వర నాట్య కళామండలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన దుర్యోధుని వధ నాటకం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. కాగా స్వామివారికి సోమవారం పట్టాభిషేక మహోత్సవం జరగనుంది. ఆలయధర్మకర్త ప్రసాద్‌రెడ్డి, ఉభయదారులు, కమిటీ సభ్యులు మణిరెడ్డి, నాదమునిరెడ్డి, కుమార్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, హరిదాసు భారతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా మహాభారత మహోత్సవాలు



పాకాల, ఆగస్టు 11: దామలచెరువు పంచాయతీ మొబ్బినాయనపల్లెలో గత నెల 31వతేది ధ్వజారోహణంతో మొదలైన మహాభారత మహోత్సవాలు ఆదివారం రాత్రి అగ్నిగుండ ప్రవేశంతో వైభవంగా ముగిసాయి. 12 రోజులపాటు పగలు హరికథ, రాత్రి నాటక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. మొబ్బినేని చైతన్యకుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం దురోధన వధ, రాత్రి అగ్నిగుండ ప్రవేశం, ధర్మరాజుల పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు.

ఆకట్టుకున్న భీష్మ విజయం

రామచంద్రాపురం, ఆగస్టు 11: రామాపురం మహాభారత ఉత్సవాల్లో భాగంగా భాగవతారిణి అనసూయ వినిపించిన భీష్మ విజయం సభికులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయంలో మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. మధ్యాహ్నం బ్రహ్మర్షి పీఠం ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. సాయంత్రం మేళతాళాల నడుమ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఊరేగింపు జరుగుతుండగా గ్రామస్తులు మంగళహారతులు ఇచ్చారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.65 కోట్లు

తిరుమల,ఆగస్టు11(ఆంధ్రజ్యోతి):తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.65 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.3.65 కోట్లు ఆదాయం లభించినట్లు టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 79,313 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 39,344 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

చంద్రగిరి కోదండరాముడికి వెండి కిరీటం బహూకరణ



చంద్రగిరి, ఆగస్టు 11: చంద్రగిరిలో వెలసిన కోదండరామాలయంలో స్వామివారికి వెండి కిరీటం, కర్ణపత్రాలను దాతలు బహూకరించారు. చంద్రగిరికి చెందిన సుశీలమ్మ, నాదమునిరెడ్డి, రూ.69 వేల విలువైన 117 గ్రాముల వెండి కిరీటం, కర్ణపత్రాలను ఆదివారం ఆలయ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు బాబుస్వామి, మోహన్ స్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునిహరి బాబు, తదిరులు పాల్గొన్నారు.

కేబీఆర్‌నగర్‌లో అక్రమ నిర్మాణాల తొలగింపు

● అనుమతులు ఇచ్చిన అధికారులపై ఎమ్మెల్యే నాని ఆగ్రహం

మంగళం, ఆగస్టు 11: మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీ కేబీఆర్‌నగర్‌లో కాలువలపై నిర్మించిన అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. వర్షాలకు కేబీఆర్‌నగర్‌లో రోడ్లపైకి, ఇళ్లల్లోకి నీరు చేరడంతో ఆదివారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తహసీల్దారు భాగ్యలక్ష్మితో కాలనీలో పర్యటించారు. స్థానికులను పరామర్శించి, నీరు నిలిచిపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాలువలపై అక్రమంగా నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు పట్టించుకోకపోవడం, నిర్మాణాలు జరిగిన వాటికి విద్యుత్ కనెక్షన్లు, ఇంటి పన్నులు మంజూరు చేసిన అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ప్రాంతంలో కాలువలపై అక్రమంగా నిర్మించిన కట్టడాలను, విద్యుత్ కనెక్షన్లను తొలగించాలని తహసీల్దారును ఆదేశించారు. తాగునీటికి సైతం ఇబ్బంది పడుతున్నామని ప్రజలు చెప్పడంతో ఈ ప్రాంతంలో ఆర్వో ప్లాంట్ మంజూరు చేయిస్తామన్నారు. అలాగే కేబీఆర్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్, గుడి, శ్మశానానికి స్థలం కల్పించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరగా, త్వరలోనే ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. కేబీఆర్‌నగర్ ప్రధాన మార్గం నడవడానికి సైతం వీలులేకుండా ఉండటాన్ని గమనించిన ఎమ్మెల్యే వెంటనే గ్రావెల్‌ను రోడ్డుపై వేసి స్థానికులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపీనాథ్, ఎంపీడీవో రమేష్, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి మురళి, ఎలక్ట్రికల్ ఏఈ హరికృష్ణ, వీఆర్వోలు, తిరుమలనగర్ పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు గోవిందరాజులు, కార్యదర్శి చెన్నరాయప్ప తదితరులు పాల్గొన్నారు.





కాలువపై అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న దృశ్యం - (ఇన్‌సెట్‌లో) అక్రమ నిర్మాణాలను తొలగించాలని తహసీల్దారును ఆదేశిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ఎన్‌ఎస్‌యూలో సంస్కృత వారోత్సవాలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ అహల్య

తిరుపతి రూరల్, ఆగస్టు 11: తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ(ఎన్‌ఎస్‌యూ)లో సంస్కృత వారోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన కర్ణాటక సంస్కృత వర్సిటీ వీసీ ఎస్.అహల్యతో సీడాక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌డీ సుదర్శన్, ఎన్‌ఎస్‌యూ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తిలు కలసి ప్రారంభించారు. ప్రొఫెసర్అహల్య మాట్లాడుతూ.. సంస్కృత భాష భారతీయ సంపద అన్నారు.

జనబాహుళ్యంలోకి సంస్కృత విజ్ఞానం: ప్రాచీన సంస్కృత వాఙ్మయంలోని అత్యంత అరుదైన గ్రంథాల్లోని విజ్ఞానాన్ని అధునాతన సాంకేతికత ద్వారా జనబాహుళ్యంలోకి తీసుకురావాలని బెంగళూరుకు చెందిన సీడాక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌డీ సుదర్శన్ తెలిపారు. ఎన్‌ఎస్‌యూలో సింబయాసిస్ బిట్వీన్ సాంస్క్రిట్ అండ్ కంప్యూటర్స్ న్యూ పర్‌స్పెక్టివ్స్ అనే అంశంపై ఆదివారం నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. సీడాక్ సంస్థతో పరస్పర అవగాహనా ఒప్పందం కుదుర్చుకుని, సంస్కృతజ్ఞానాన్ని కంప్యూటేషనల్ టెక్నాలజీ ఉపయోగించి ఆధునికతరానికి అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ, కోఆర్డినేటర్ కె.గణపతిభట్, అకడమిక్‌డీన్ రజనీకాంత్‌శుక్లా, వాగ్వర్ధినీ పరిషత్ కోఆర్డినేటర్ సి.నాగరాజు, డాక్టర్ ఉదయన హెగ్డే, పీఆర్వో వి.రమేష్‌బాబు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

పబ్లిక్ కన్సల్టెన్సీ కేంద్రాలు ప్రారంభం: యోగా, జ్యోతిష, ఆగమ, కర్మకాండ, వాస్తు శాస్త్రాలకు సంబంధించి సామాన్య ప్రజలు తమ సమస్యలు నివృత్తి చేసుకునేందుకు ఎన్‌ఎస్‌యూలో ఏర్పాటుచేసిన ఐదు పబ్లిక్ కన్సల్టెన్సీ(పరామర్శక) కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. కర్ణాటక సంస్కృత వర్సిటీ వీసీ ఎస్.అహల్యతో కలిసి ఈ కేంద్రాలను వీసీ ప్రారంభించారు. రోజూసాయంత్రం 5-6.30గంటల వరకు ఈ కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ వేదాంతం విష్ణుభట్టాచార్యులు వ్యవహరించారు.

యువత మేధస్సు అందరికీ ఉపయోగపడాలి

● శ్రీవిద్యానికేతన్ గ్రాడ్యుయేషన్ డేలో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క





డిగ్రీ పట్టా అందజేస్తున్న తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క - సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

చంద్రగిరి, ఆగస్టు 11: డిగ్రీ పట్టా అందుకుని కొత్త ప్రపంచంలోకి అడుగు పెడుతున్న యువత మేధస్సు అందరికీ ఉపయోగపడాలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఎ.రంగంపేట సమీపంలోని శ్రీవిద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాల 13వ గ్రాడ్యుయేషన్‌డే, మోహన్‌బాబు విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథి భట్టి విక్రమార్క మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాల్లో స్థిరపడి తమస్థాయి, హోదా పదిమందికి ఉపయోగపడే విధంగా మలుచుకోవాలన్నారు. మనం బతుకుతూ పదిమందిని బతికించడం గొప్ప విషయమన్నారు. ఎన్ని విజయాలు సాధించినా గతాన్ని మరిచిపోకూడదని తెలిపారు. అనంతరం ఎంబీయూ ఛాన్సలర్ డాక్టరు ఎం.మోహన్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పటికీ తల్లిదండ్రులను మరవకూడదన్నారు. అనంతరం భట్టి విక్రమార్క చేతులమీదుగా విద్యార్థులకు పట్టాలు అందజేశారు. భట్టి విక్రమార్కను మంచు మోహన్‌బాబు, ప్రొఛాన్సలర్ మంచు విష్ణులు శాలువాతో సత్కరించి, మెమెంటో అందజేశారు. అంతముందు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంబీయూ వైస్ ఛాన్సలర్ నాగరాజరామారావు, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ ఉమామహేశ్వరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భాషోపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వర్

తిరుపతి(విద్య), ఆగస్టు 11: భాషోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలని భాషోపాధ్యాయ సంస్థ (ఎస్‌ఎల్‌టీఏ) జిల్లా అధ్యక్షుడు దొడ్డ ఉమామహేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌ఎల్‌టీఏ జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక టీపీపీఎం ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో డీఈవో పూల్‌లో సుమారు 1000 మంది భాషాపండితులు ఉన్నారని, వారికి సత్వరమే పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించకుండా సర్దుబాట్లకు పూనుకోవడం సమంజసం కాదన్నారు. జీవో 117 ప్రకారం కాకుండా జీవో 53 ప్రకారం సర్దుబాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర కార్యదర్శి ఎస్ ప్రకాష్, గౌరవ సలహాదారుడు ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి విశ్వనాథం, జిల్లా ఉపాధ్యక్షుడు సహదేవుడు, ఇతర నేతలు శ్రీరాములు, పట్టాభిరామయ్య, శ్రీనివాసులు, రామచంద్రయ్య, గణపతి, గంగులయ్య, సుందరయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

మహతిలో ముగిసిన నృత్యపోటీలు



నృత్య పోటీల విజేతలను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 11: తిరుపతి మహతీ క్షేత్రంలో ఆదివారం చివరి రోజు శ్రీకృష్ణదేవరాయ జాతీయ సంగీత, నృత్య పోటీల్లో భాగంగా జరిగిన సభలో తిరుపతికి చెందిన ప్రముఖులు పీసీ రాయల్, ఊకా విజయకుమార్, ఎం.వేణుగోపాల్‌రెడ్డి, చిన్నంగారి రమణ, ఆకుల సతీష్, కొత్తపల్లి మునిరత్నం, వైఎస్ బాబులు ముఖ్యఅతిథులుగా హాజరై కళాకారులను సత్కరించారు. వివిధ రంగాలలో ప్రతిభ చూపిన జోగు విద్యాహాసిని(నాట్యయశస్విని), జి.శంకర్ (విశిష్ట సేవాభూషణ్), మంచూరి జనార్థనరెడ్డి (ఉత్తమ ఉపాధ్యాయ), నాగిశెట్టి వెంకటరమణయ్య (నాట్యకౌముది), కె.వెంకటేశ్వర్లు (నాట్యప్రవీణ) పురస్కారాలతో సత్కరించారు. సంగీత, సాహిత్య, నృత్యపోటీలతో యువతకు చక్కటి అవకాశాలు కల్పిస్తున్న రాయలసీమ రంగస్థలి సంస్థ మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని అభిలషించారు. శుక్రవారం నుంచి మూడురోజులు జరిగిన పోటీలలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వందలాది మంది కళాకారులు జానపద, శాస్త్రీయ నృత్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గుండాల గోపినాథరెడ్డి, కార్యదర్శి కేఎస్ రాజ, శ్రీరాములుయాదవ్, టి.సుబ్రమణ్యం, కొత్తపల్లి మునిరత్నం, చెంగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన విష్ణుప్రియ గాత్రం



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 11: స్వరభారతి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అమరావతి నగర్‌లో నిర్వహించిన విష్ణుప్రియ గాత్ర కచేరి ఆహుతులను అలరించింది. విశాఖపట్టణానికి చెందిన విష్ణుప్రియ ప్రముఖ విద్వాంసులు మండా సుధారిణి వద్ద సంగీతం నేర్చుకున్నారు. ఈ గాత్ర కచేరిలో కెవి. కృష్ణ (వయోలిన్), కృష్ణవంశి (మృదంగం), వాద్య సహకారం అందించారు. అనంతరం మొదిలి మురళీకృష్ణ.. గాయనిని ఘనంగా సత్కరించారు. నిర్వాహకులు హరిచందన వెంకటేష్, హేమా బాలాజీ, సంగీత ప్రియులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



తిరుచానూరు, ఆగస్టు 11: తిరుపతిలోని శిల్పారామంలో ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అలరించింది. తిరుపతి నగరానికి చెందిన అంకయ్య బృందం భక్తి గీతాలకు, దేశభక్తి గీతాలకు నృత్య ప్రదర్శన చేశారు. కళాకారులు జయము జయము భరతమాత, ఐ లవ్ మై ఇండియా, జగతిసిగలో జాబిలమ్మకు, ఓం నమశ్శివాయ, నటరాజా నీ ఆజ్ఞరా, వచ్చెను అలమేలుమంగ వంటి కీర్తనలకు నృత్యం చేశారు. అదే విధంగా రెడ్డప్ప బృందం ప్రదర్శించిన జానపద నృత్యాలాపన సభికులను ఆకట్టుకుంది. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

'వాలుకుర్చీలో తలపోతలు' ఆవిష్కరణ



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 11: తిరుపతికి చెందిన రచయిత, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కూతటి వెంకటరెడ్డి రచించిన వాలుకుర్చీలో తలపోతలు పుస్తకం ఆవిష్కరణ ఆదివారం స్థానిక ఎస్వి నగర్‌లోని ఆయన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు వెంగమ్మ మాట్లాడుతూ... వెంకటరెడ్డి 92 సంవత్సరాల వయసులో తన అనుభవాలను ఇలా పుస్తకరూపంలో తీసుకురావడం సంతోషకరమన్నారు. ప్రస్తుతం వ్యాపారంగా మారిన విద్యా విధానానికి ఈ ఆత్మకథ ఎంతో కనువిప్పు కలిగిస్తుందన్నారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజు మాట్లాడుతూ... తనకు డిగ్రీలో అధ్యాపకులైన వెంకటరెడ్డి పుస్తకాన్ని గురుదక్షిణగా ప్రచురించే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పరిశోధక విద్యార్థి గరికపాటి రమేష్, రెడ్డెప్పరెడ్డి, అప్పసామి పిళ్ళై, చలపతి, రామకృష్ణ, విజయ పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టెక్‌మహేంద్ర సంస్థ మాజీ సీఈవో సీపీ గుర్నాని, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, బిగ్‌బాస్ కంటిస్టెంట్ రతిక, తెలంగాణ ఎమ్మెల్యే వెంకటరాజు, మాజీ ఎంపీ బాల్కసుమన్, ఉన్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి పుష్కరిణికి జోరుగా మరమ్మతులు



తిరుమల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శ్రీవారి పుష్కరిణికి ఈనెల ఒకటో తేదీన మొదలైన మరమ్మతులు ప్రస్తుతం జోరుగా జరుగుతున్నాయి. ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాలకు ముందు పుష్కరిణికి మరమ్మతులను చేసి.. తిరిగి నీటిని నింపడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈనెల ఒకటి నుంచి 31వ తేదీ వరకు పుష్కరిణిని మూసివేసి మరమ్మతులు చేయాలని టీటీడీ నిర్ణయించింది. దాంతో ఒకటో తేదీనుంచి పుష్కరిణిలోకి భక్తుల అనుమతిని రద్దు చేసి.. ఉన్న నీటిని తోడే పనులను మొదలుపెట్టారు. ప్రస్తుతం నీటి మొత్తాన్ని తోడేశారు. పలుచోట్ల పగుళ్ల వచ్చిన పైపులకు మరమ్మతులు చేశారు. పూడికను శుభ్రం చేయడంతో మొదటి దశ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. రానున్న పదిరోజుల్లో మరమ్మతులన్నీ పూర్తిచేసి పెయింట్ వేయనున్నారు. చివరి పదిరోజులు మూడో దశలో తిరిగి పరిశుభ్ర నీటిని నింపి.. పుష్కరిణిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి భక్తులను పుష్కరిణిలోకి అనుమతిస్తారు.

16న తిరుమలలో ఛత్రస్థాపనోత్సవం

తిరుమల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని నారాయణగిరి శ్రీవారిపాదాల చెంత ఈనెల 16వ తేదీన ఛత్రస్థాపనోత్సవం జరగనుంది. ఈసందర్భంగా అర్చక బృందం శ్రీవారి పాదాలకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించిన గొడుగును ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. ఏడాదికోసారి ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తిరుమల ఏడుకొండల్లో అత్యంత ఎత్తయిన నారాయణ గిరి శిఖరంపై కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామి మొదటిగా కాలు మోపినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా శ్రావణ శుద్ధ ద్వాదశినాడు ఛత్రస్థాపనోత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవానికి మరో నమ్మకం కూడా ఉంది. నారాయణగిరి శిఖరం ఎక్కువ ఎత్తులో ఉండడంతో ఎక్కువగా గాలులు వీస్తాయి. ఈ గాలుల నుంచి ఉపశమనం కల్పించాలని వాయుదేవుడిని ప్రార్థిస్తూ ఇక్కడ గొడుగును ప్రతిష్ఠిస్తారు. నారాయణగిరిలోని శ్రీవారిపాదాలకు తిరుమంజనం నిర్వహించేందుకు ఆలయంలోని బంగారు బావి నుంచి తీర్థాన్ని తీసుకుంటారు. శ్రీవారి ఆలయంలో రెండో గంట తర్వాత పూజా సామగ్రి, పుష్పాలు, నైవేద్యానికి ప్రసాదాలు సిద్ధం చేసుకుంటారు. రంగనాయకుల మండపం నుంచి గొడుగులతో మంగళవాయిద్యాల నడుమ మహాప్రదక్షిణంగా మేదరమిట్ట వద్దకు చేరుకుంటారు. అక్కడినుంచి అర్చకులు నారాయణగిరి శిఖరం చేరుకుని తీర్థంతో శ్రీవారిపాదాలకు తిరుమంజనం నిర్వహించి, అలంకారం, పూజ, నైవేద్యం సమర్పిస్తారు. తదనంతరం వేదపారాయణదారులు ప్రబంధ శాత్తుమొర నిర్వహించి, శ్రీవారి పాదాల చెంద గొడుగును ప్రతిష్ఠించి భక్తులకు ప్రసాదాల పంపిణీ చేస్తారు.

పేరూరులో వివాదంగా కాల్వ పొరంబోకు భూమి !



తిరుపతి రూరల్, ఆగస్టు 11: తిరుపతి రూరల్ మండలం పేరూరులో సర్వేనెంబరు 460, 460/2 లోని మొగిలికళం కాలువ పొరంబోకు భూమి వివాదంగా మారింది. ఈ స్థలంలో ఆదివారం ఆ గ్రామానికి చెందిన అధికార, ప్రతిపక్షపార్టీ నేతల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. స్థానిక మహిళలు పెద్ద ఎత్తున చేరుకోవడంతో రెండుగంటలకి పైగా ఇరువర్గాల నేతలు రచ్చరచ్చ చేశారు. ఇదిలా ఉండగా.. గత వైసీపీ పాలనలో ఇదే సర్వే నెంబరులో కాల్వ పొరంబోకు స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన 11 అక్రమ నిర్మాణాలని వెంటనే తొలగించాలని సర్పంచ్ దామినేటి కేశవులుతో టీడీపీ నేతలు వాగ్వాదం చేశారు. ఆ నిర్మాణాలకు పంచాయతీ అధికారులు ఎన్వోసీ ఇచ్చి విద్యుత్‌మీటర్లని ఇవ్వడంపై మండిపడ్డారు. ఇదేస్థలంలో రెండ్రోజుల క్రితం ఆక్రమణదారులు చేపట్టిన మరో రెండు నిర్మాణాలను తొలగించాలని, ఎస్టీకాలనీకి అంగన్వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఈ స్థలం అవసరమని సర్పంచ్ టీడీపీ నేతలతో వాగ్వాదం చేశారు. ఇరువర్గాల నేతల వాదోపవాదాల తర్వాత ఇరువురు ఒక అంగీకారానికి వచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కాలువ స్థలంలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలన్నింటినీ తొలగించాలని టీడీపీ నేతలు డిమాండ్ చేయగా.. అందుకు సర్పంచ్ స్పందించి తాము కూడా మీ వెంట నడుస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సదుమణిగింది. గ్రామ టీడీపీనేతలు దామినేటి నాగరాజు, జ్ఞానేశ్వరరెడ్డి, మహేష్, మహిళలు పాల్గొన్నారు.

అఖిల భారత యాదవ మహాసభ విజయానికి పిలుపు



మాట్లాడుతున్న మహేశ్వరి యాదవ్

తిరుపతి(కపిలతీర్థం), ఆగస్టు 11: నవంబరు నెలలో శ్రీవారి పాదాల చెంత తిరుపతిలో నిర్వహించే అఖిల భారత యాదవ మహాసభ శతాబ్ది ఉత్సవాల్లో యాదవులంతా పాల్గొని జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షురాలు మహేశ్వరి యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్ క్లబ్ ఆదివారం యాదవ సంఘం నేతలతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడుతూ.. అఖిల భారత యాదవ మహాసభ నిర్వహించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఏడాది ఘనంగా నిర్వహించే ఉత్సవాలకు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని యాదవులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. నేతలు శేషు, నాగమల్లేశ్వరి, దత్తుయాదవ్, శివ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో రెవెన్యూ, విద్యుత్‌శాఖల మంత్రులు

● మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్



తిరుపతి(విద్య), ఆగస్టు 11: రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం రాత్రి తిరుపతికి వచ్చారు. స్థానిక గ్రాండ్‌రిడ్జ్ హోటల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి, తిరుమల పర్యటనకు ఆహ్వానించి, కొంతసేపు ముచ్చటించారు.

నేడు రైలు ప్రమాదాలపై ఉద్యోగులకు అవగాహన

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 11: రైలు మార్గాలపై జరుగుతున్న ప్రమాదాలపై ఉద్యోగులకు అవగాహన సదస్సును రేణిగుంట స్టేషన్ ప్రాంగణంలోని రైల్ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించనున్నట్లు తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణ మధ్య రైల్వేలో జరుగుతున్న రైలు ప్రమాదాలు - ఆత్మహత్యలు అనే అంశంపై ఉదయం 10 గంటలనుంచి ఉద్యోగులకు అవగాహన కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సుకు సికింద్రాబాదు నుంచి సీసీఎం(క్లైమ్స్) రవిప్రసాద్ పాడి హాజరు కానున్నారని తెలిపారు. రేణిగుంట రైల్వే జంక్షన్ సమీపంలో వున్న శ్రీకాళహస్తి, తిరుపతి, పాకాల స్టేషన్లలో ఉన్న ఉద్యోగులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తిరుపతి, చంద్రగిరిలో పోలీసుల కార్డన్ సెర్చ్

రికార్డులు లేని వాహనాల సీజ్


పోలీసులు సీజ్ చేసిన రికార్డులు లేని వాహనాలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 11: ఎస్పీ సుబ్బరాయుడి ఆదేశాల మేరకు ఆదివారం తిరుపతి, చంద్రగిరి సబ్ డివిజన్ల పరిధిలోని తిరుపతి ఈస్ట్, ఎంఆర్పల్లి స్టేషన్ల ప్రాంతాల్లో ఆయా డీఎస్పీల నేతృత్వంలో పోలీసులు కార్డన్ సెర్చ్ చేశారు. తిరుపతి సబ్ డివిజన్ పరిధిలోని రైల్వే కాలనీ, సుందరయ్యనగర్, మధురానగర్ ప్రాంతాల్లో సీఐ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు శ్రీకాంత్‌రెడ్డి, పురుషోత్తమరెడ్డి, ఏఎస్ఐలు, సిబ్బంది ఆకస్మికంగా ఉదయాన్నే ఇంటింటా తనిఖీలు చేశారు. అనుమానం వున్న ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసి, విచారించి పంపారు. ఆధార్ కార్డులు పరిశీలించి, వివరాలు తీసుకున్నారు. ఈ తనిఖీల్లో ఎలాంటి రికార్డులు లేని 55 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. చంద్రగిరి సబ్ డివిజన్ పరిధిలోని తిరుపతి రూరల్ సర్కిల్ సీఐ అహ్మద్ ఆధ్వర్యంలో ఎస్ఐలు నాగేంద్రబాబు, షేక్ షావలి, సిబ్బంది కలసి మల్లంగుంట పంచాయతీ పరిధిలోని గరుడాద్రి, వెంకటాద్రి అపార్టుమెంట్లలో కార్డన్ సెర్చ్ చేశారు. ప్రధానంగా ట్రబుల్ మాంగర్స్, రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సీఐలు చెప్పారు. ఈ తనిఖీల్లో ఎలాంటి రికార్డులు లేని ఒక జీపు, మూడు కార్లు, నాలుగు ఆటోలు, 40 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ అహ్మద్ చెప్పారు. అనుమానాస్పదంగా సంచరించే వారి వివరాలను పోలీసులకు తెలియచేయాలని ఆయన కోరారు.

వినాయకసాగర్‌ను సుందరంగా తయారు చేస్తాం

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి (జీవకోన), ఆగస్టు 11: వినాయకసాగర్‌ను సుందరంగా తయారు చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. వినాయకసాగర్‌లో వాకర్స్‌తో కలిసి ఎమ్మెల్యే ఆదివారం మార్నింగ్ వాక్ చేశారు. వినాయకసాగర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనకు స్వాగతం పలికారు. వాకింగ్ ట్రాక్ టైల్స్ కొన్ని చోట్ల కుంగడాన్ని, డ్రైనేజీ నీరు వినాయకసాగర్‌లో కలుస్తుండటాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. గత ఏడాది వినాయక నిమజ్జనం తరువాత విగ్రహాలను తీసివేయకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. టాయిలెట్స్ లేక ఇబ్బంది పడుతున్నట్లు వాకర్స్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వాకర్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు.వినాయక నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందిలేకుండా, అన్ని వసతులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బాలాజీనాయుడు, శివారెడ్డి, కృష్ణంరాజు, టీడీపీ నాయకులు వెంకటరత్నం, వెంకట్‌రాయల్, యోగా మాస్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రమేష్ చంద్రప్రసాద్‌కు పలువురి నివాళి


రమేష్‌చంద్రప్రసాద్ చిత్రపటం వద్ద నాయకులతో కలిసి నివాళి అర్పిస్తున్న నగరి, సత్యవేడు ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాష్, ఆదిమూలం

నింద్ర, ఆగస్టు 11: ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు గంధమనేని రమేష్‌చంద్ర ప్రసాద్‌కు పలువురు నేతలు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఆయన స్వగ్రామమైన నింద్ర మండలం ఉరూరుపేటలో ఆదివారం కర్మక్రియలు జరిగాయి. ఈ సందర్భంగా సంతాప సభ నిర్వహించారు. టీడీపీకి రమేష్‌చంద్ర ప్రసాద్ చేసిన సేవలను పలువురు ఎమ్మెల్యేలు, నేతలు గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆయనకు పుష్పాంజలి ఘటించిన వారిలో మాజీ మంత్రి కరణం బలరాం, నగరి, సత్యవేడు ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాష్, ఆదిమూలం, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీనివాసులు, జయచంద్రనాయుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, నేతలు ఎస్సీవినాయుడు, నేతలు చంద్రప్రకాష్, అశోక్ రాజు, ఆర్సీ మునికృష్ణ, ఎంఎం రాధాకృష్ణ, చినబాబు, ప్రకాష్‌నాయుడు, పాకా రాజా, వెంకటేశ్వరరావు, ధనంజయనాయుడు, దశరధవాసు, గాలి రమేష్‌నాయుడు, ఢిల్లీబాబు, గంగాధరం నాయుడు, ధనంజయయాదవ్, ధనంజయ నాయుడు, లక్ష్మీపతిరాజు, గిరి, మురళీనాయుడు, రవికుమార్, గిరిబాబు, శివక్రిష్ణమనాయుడు, పీఎస్. రాధాకృష్ణ, గజేంద్రనాయుడు, చంద్ర, రమేష్, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన ఎంపీడీవోలు

18మందికి పూర్వపు మండలాల్లోనే పోస్టింగ్‌లు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 11: సార్వత్రిక ఎన్నికల విధుల కోసం ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన ఎంపీడీవోలు ఆదివారం తిరుపతి జిల్లాకు చేరుకున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం ఇక్కడికి వచ్చిన ఎంపీడీవోలు శనివారం సాయంత్రం రిలీవ్ అయి సొంత జిల్లాలకు వెళ్లిపోయారు. తిరుపతి జిల్లాలోని 18మంది ఎంపీడీవోలకు వారి పూర్వపు మండలాల్లోనే పోస్టింగ్ ఇచ్చారు. నెల్లూరు జిల్లా ప్రజాపరిషత్ పరిధిలోని పలు మండలాలకు సీఈవో కన్నమ నాయుడు పోస్టింగ్స్ ఇచ్చారు. బి.సింగయ్య(దొరవారిసత్రం), కె.వెంకటేశ్వరరావు(గూడూరు), వి.వి.సూర్యసాయి(చిల్లకూరు), ఎం.భవాని(కోట), కె.షాలెట్(చిట్టమూరు), కె.సురేష్‌బాబు(పెళ్లకూరు), పి.ప్రసన్నకుమారి(డక్కిలి), ఎ.ప్రమీలారాణి(సూళ్ళూరుపేట), వి.రజనీకాంత్(ఓజిలి), కేవీ వెంకటేశ్వరరావు(వెంకటగిరి)లను నియమించారు. ఉమ్మడి చిత్తూరు జడ్పీ పరిధిలోని పలు మండలాలకు జడ్పీ సీఈవో గ్లోరియా ఎంపీడీవోలకు పోస్టింగ్స్ ఇచ్చారు. పి.భానుమూర్తిరావు(వడమాలపేట), పీఎంఆర్ ప్రభాకర్(పాకాల), కె.సురేష్‌బాబు(తొట్టంబేడు), కనకం శ్రీనివాసులు(ఆర్సీపురం), పి.సాయిలహరి(బీఎన్‌కండ్రిగ), కె.రామచంద్ర(కేవీబీపురం), ఎ.అమర్‌నాథ్(యర్రావారిపాళెం), బి.బాలాజీనాయక్(చంద్రగిరి)లను నియమించారు. పోస్టింగ్స్ వచ్చిన ఎంపీడీవోలు తక్షణం విధుల్లో చేరాలని ఆదేశాలు ఇచ్చారు. ఇటీవల పలువురు ఎంపీడీవోలు పదవీ విరమణ చెందారు. వారికికూడా ఆ స్థానాలను భర్తీ చేయాల్సి ఉంది.

జిల్లాలో ముగ్గురు ఎస్ఐల బదిలీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 11: ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 16 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఉత్తర్వులు విడుదల చేయగా, అందులో తిరుపతి జిల్లా నుంచి ముగ్గురిని బదిలీ చేశారు. రామచంద్రాపురం మండలంలో ఎస్ఐగా పనిచేస్తున్న చిరంజీవిని తవణంపల్లికి, తిరుపతి ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న పి.ధరణీధరను కాణిపాకానికి, తిరుచానూరులో పనిచేస్తున్న వెంకటసుబ్బయ్యను వెదురుకుప్పానికి, తిరుపతి సీఐడీలో పనిచేస్తున్న పి.రాజ్‌కుమార్‌ను కార్వేటినగరానికి బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణం అమల్లోకి వస్తాయన్నారు.

తైక్వాండో ఓవరాల్ ఛాంపియన్‌గా ఆంధ్రా


మెడల్స్ సాధించిన క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 11: తైక్వాండో ఓవరాల్ ఛాంపియన్‌గా ఆంధ్రప్రదేశ్ జట్టు నిలిచింది. స్థానిక రామతులసి కల్యాణ మండపంలో టెంపుల్ ఆఫ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఫస్ట్ ఓపెన్ సౌత్‌జోన్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ 2024 పోటీలు నిర్వహించారు. ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటకల నుంచి మొత్తం 400మంది బాల బాలికలు ప్రాతినిధ్యం వహించారు. సబ్‌జూనియర్, క్యాడెట్స్, జూనియర్, సీనియర్ విభాగాలలో పోటీలు నిర్వహించగా, 80మంది బాల బాలికలు ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. వీరికి బంగారు పతకాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ యూత్ లీడర్ జగదీష్ చేతుల మీదుగా అందజేశారు. ఓవరాల్ ఛాంపియన్‌ను ఆంధ్రా జట్టు కైవసం చేసుకోవడంతో షీల్డ్, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఆఫ్ స్పోర్ట్స్ అకాడమీ అధ్యక్షులు గీత, ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, ట్రెజరర్ మంజుల, పర్యవేక్షకులు మాస్టర్ గోపీ నాయుడు పాల్గొన్నారు.

టీటీడీలో ఏ పనీ మా సొంత నిర్ణయం కాదు

ఏరోజు ఏ దుర్వార్త వినాల్సి వస్తుందోనని భయమేస్తోంది ● నోటీసులు వెనక్కి తీసుకునేలా చర్యలు తీసుకోండి ● తిరుపతి ఎమ్మెల్యే ముందు ఇంజనీరింగ్ ఉద్యోగుల ఆవేదన


ఎమ్మెల్యే ఆరణి వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

తిరుమల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): 'టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలో దాదాపు 30 ఏళ్లుగా మేము విధులు నిర్వహిస్తున్నాం. ఎన్నడూ ధార్మిక సంస్థకు చిన్నపాటి మచ్చ కూడా రానీయకుండా పైఅధికారుల ఆదేశాలకు అనుగుణంగా పనిచేశాం. ఎప్పుడూ స్వలాభాపేక్షకు తావు ఇవ్వలేదు. టీటీడీలో ఏఒక్క పనీ మా సొంత నిర్ణయం కాదు. టీటీడీ ఈవో, బోర్డు నిర్ణయాల మేరకు పనులు చేశాం. అటువంటిది మూడ్రోజులుగా ఇంజనీరింగ్ విభాగంలో దాదాపు 50 మందికిపైగా స్టేట్ విజిలెన్స్ నోటీసులు జారీ చేసింది. వాటిని వెంటనే వెనక్కి తీసుకునేలా చర్యలు తీసుకోండి' అంటూ టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే పలువురు ఉద్యోగులు ఆదివారం తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముందు ఆవేదన వ్యక్తం చేస్తూ వినతిపత్రమిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలోని టీటీడీ ధర్మకర్తల మండలి, ఈవో రాజకీయ ప్రయోజనాల కోసం టీటీడీ నిధులు దుర్వినియోగం చేశారని, కమీషన్ల కోసం వందల కోట్ల రూపాయలను ఇంజనీరింగ్ పనులకు కేటాయించారనే ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై నూతన ప్రభుత్వం స్టేట్ విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. వారు దాదాపు రెండు నెలల పాటు విచారణ జరిపి మూడు, నాలుగు రోజులుగా ఇంజనీరింగ్ విభాగంలోని అధికారులు, ఉద్యోగులకు నోటీసులు జారీ చేశారు. ఈక్రమంలో కొంతమంది ఉద్యోగులు శనివారం పెన్‌డౌన్‌తో నిరసన కూడా వ్యక్తం చేసినట్లు సమాచారం. కాగా, టీటీడీ ఏఈ వీరప్రసాద్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ శివరామకృష్ణ ఇలా దాదాపు 50 మందికిపై ఆరణిని కలిసి తమ బాధను తెలియజేశారు. ఈవో, బోర్డు తీర్మానాలను తాము అమలుచేయాలని, లేకుంటే సర్వీస్ రూల్స్ ప్రకారం పైఅధికారుల ఆదేశ ధిక్కరణ కింద క్రమశిక్షణ చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇన్నేళ్లపాటు శ్రీవారిపై భక్తి, నమ్మకం, నిస్వార్థంతో విధులు నిర్వహించామన్నారు. నాలుగైదు ఏళ్లలో పదవీ విరమణ చేయబోతున్న తమ మానసిక దృఢ సంకల్పాన్ని దెబ్బతీసేలా నోటీసులు అందుకోవడం బాధాకరమన్నారు. విధి నిర్వహణలో ఎన్నో సార్లు అవార్డులు తీసుకున్న తాము ప్రస్తుతం రివార్డులు అందుకోవడం బాధను కలిగిస్తోందన్నారు. తప్పుచేస్తే శిక్షణ అనుభవించాలని కానీ పరిధుల మేరకు విధులు నిర్వహించినప్పటికీ నోటీసులు తీసుకోవడం ఏమాత్రం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు అందరికీ బీపీ, షుగరు వ్యాధులున్నాయని, ఈక్రమంలో ఏరోజు ఏవార్త వినాల్సి వస్తోందోననే భయంగా ఉద్యోగం చేసే పరిస్థితికి వెళ్లిపోతున్నామన్నారు. మానసికంగా తాము కుంగిపోకుండా న్యాయం చేయాలని కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే స్పందిస్తూ.. కావాలని తప్పు చేస్తే శిక్ష పడుతుందే తప్ప, విధి నిర్వహణలో భాగంగా ఏదైనా పొరబాటు ఉంటే వీలైనంత వరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

స్వాతంత్ర్య దిన వేడుకలకు అధిక నిధులు మంజూరు చేయడం హర్షణీయం

● కిరణ్ రాయల్


మాట్లాడుతున్న కిరణ్ రాయల్

తిరుపతి(కపిలతీర్థం), ఆగస్టు 11: మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది గ్రామాల్లో ఘనంగా స్వాతంత్ర్య దిన వేడుకలను నిర్వహించేందుకు ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయడం ప్రతీ ఒక్కరూ హర్షించదగ్గ విషయమని జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... గత 34 ఏళ్లుగా స్వాతంత్ర్య దిన వేడుకలను నిర్వహించేందుకు గ్రామాలకు కేవలం రూ.200 నుంచి 300 మాత్రమే ప్రభుత్వం విడుదల చేసేదని, ఈ ఏడాది ఉప ముఖ్యమంత్రి ఈ వేడుకలను నిర్వహించేందుకు మైనర్ పంచాయతీలకు రూ.10 వేలు, మేజర్ పంచాయతీలకు రూ.25 వేల చొప్పున నిధులు విడుదల చేశారని కొనియాడారు. గత వైసీపీ ప్రభుత్వం నిధులను దిగమింగడమే కానీ ఏ నాడు ఇటువంటి కార్యక్రమాలకు నిధులు ఖర్చు చేసిన దాఖలాలు లేవన్నారు. జనసేన నేతలు సుమన్ బాబు, మనోజ్, కిషోర్, షరీఫ్, ఆది, వినోద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కర్మ సిద్ధాంతం ఎవ్వరినీ విడిచి పెట్టదు : గత వైసీపీ ప్రభుత్వంలో తమ జనసేనానిని మూడు పెళ్లిళ్లు చేసుకున్నారని విమర్శించారని, ఇప్పుడు వైసీపీ నేత దువ్వాడ శ్రీనివాస్ విషయం ఏమైందో రాష్ట్రమంతా తెలుసని, దీనినే కర్మ సిద్ధాంతం అంటారని,అది ఎవ్వరినీ వదలదని కిరణ్ రాయల్ విమర్శించారు. దువ్వాడ జగన్నాథం సినిమా ఎంత హిట్టో అంతకుమించి సూపర్ డూపర్ హిట్టుగా దువ్వాడశ్రీనివాస్ పెళ్లిళ్లబాగోతం సోషల్‌మీడియాలో మార్మోగుతోందని అన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 11: తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. వర్సిటీ సీఐ మురళీమోహన్ కథనం మేరకు... 45 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి కొంత కాలంగా తిరుపతి-చంద్రగిరి ఫ్లైఓవర్ సమీపంలోనూ, విద్యానగర్ క్రాస్ వద్ద, స్థానిక పెట్రోలు బంకు వద్ద తచ్చాడుతుండేవాడు. అనారోగ్యంతో కాని, అతిగా మద్యం సేవించి కాని మృతి చెందాడా అనేది తెలియాల్సి ఉంది. మృతుడు బ్లూరంగు షర్టు ధరించగా, దానిపై 984 గుడ్ అని ఇంగ్లీషులో రాసి వుంది. ఎవరైనా గుర్తు తెలిసిన వ్యక్తులు తిరుపతి ఎస్వీయూనివర్శిటీ సీఐ మురళీమోహన్ 94910 74524 నెంబరుకు అవసరమైన సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

తిరుపతి నుంచి పలు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 11: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా తిరుపతి నుంచి ఐదు ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. ఈ నెల 14న తిరుపతి - నాగర్‌సోల్‌ల మధ్య ప్రత్యేక రైలు(07417) ఉదయం 8.15 గంటలకు బయలుదేరి రేణిగుంట, కోడూరు, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, ముద్దనూరు, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూర్, యాదగిరి, చిట్టపూర్, తాండూర్, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాదు, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్, నాందేడ్, పూర్ణా, పర్‌భాని, సెలు, పార్‌టూర్, జాల్నా, ఔరంగాబాద్‌ల మీదుగా మరుసటిరోజు ఉదయం 10 గంలకు నాగర్‌సోల్‌కు చేరుకొంటుంది. నాగర్‌సోల్‌లో ఈ ప్రత్యేక రైలు(07418) 15వ తేది రాత్రి 10 గంటలకు బయలుదేరి, వెళ్లిన మార్గంలోనే ప్రయాణిస్తూ మరుసటి రోజు రాత్రి 10.30 గంటలకు తిరుపతికి చేరుకొంటుంది. అదేవిధంగా తిరుపతి - సికింద్రాబాదు మధ్య 17వ తేది ప్రత్యేక రైలు(07489) సాయంత్రం 5.15 గంటలకు బయలుదేరి రాయలసీమ ఎక్స్‌ప్రెస్ మార్గంలో ప్రయాణిస్తూ మరుసటి రోజు ఉదయం 7.25 గంటలకు సికింద్రాబాదుకు చేరుకొంటుంది. సికింద్రాబాదులో ఈ ప్రత్యేక రైలు(07490) 18వ తేది సాయంత్రం 6.10 గంటలకు బయలుదేరి వెళ్లిన మార్గంలోనే ప్రయాణిస్తూ మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతికి చేరుకొంటుంది. అలాగే తిరుపతి నుంచి నాందేడ్‌కు 19వతేది సాయంత్రం 5.15 గంటలకు ప్రత్యేక రైలు(07417) బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయంరోడ్డు, రాయచూర్, క్రిష్ణ, యాదగిరి, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాదు, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్, ముడికేడ్ స్టేషన్లలో ఆగుతూ మరుసటి రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు నాందేడ్‌కు చేరుకొంటుందని ఆయన తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సీపీఆర్‌వో విజ్ఞప్తి చేశారు.

అనుమానాస్పద స్థితిలో తెలుగుగంగ ఉద్యోగి మృతి


హరి మృతదేహం

శ్రీకాళహస్తి, ఆగస్టు 11: తెలుగుగంగ ఉద్యోగి ఒకరు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాళహస్తి తెలుగు గంగ శాఖలో ఉద్యోగం చేస్తున్న హరి (45) పట్టణంలోని ప్రాజెక్టు వీధిలో కాపురం ఉంటున్నాడు. ఆదివారం అర్ధ రాత్రి వేళ కుటుంబ సమస్యలతో ఇంటి వద్ద ఉరేసుకున్నట్లుగా చెబుతూ కుటుంబీకులు హరిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీనిపై ఒకటో పట్టణ పోలీసులు అనుమానాస్పద మృతిగా భావించి విచారిస్తున్నారు.

బాధ్యతలు స్వీకరించిన అర్బన్, రూరల్ సీఐలు


సంఘమేశ్వర రావు - బాబీ

నాయుడుపేట, ఆగస్టు 11: నాయుడుపేట అర్బన్ సీఐగా బాబీ, రూరల్ సీఐగా సంఘమేశ్వర రావు బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం వారి వారి కార్యాలయాల్లో పూజలు నిర్వహించి బాధ్యతలు చేపట్టారు. అర్బన్ సీఐ బాబీ నెల్లూరు టూ టౌన్‌లో పనిచేస్తూ బదిలీపై నాయుడుపేట అర్బన్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. అలాగే రూరల్ సీఐ సంఘమేశ్వర రావు వెంకటగిరిలో పనిచేస్తూ బదిలీపై నాయుడుపేట రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టారు.

బదిలీపై వెళ్తున్న సీఐకి సన్మానం



నాయుడుపేట టౌన్, ఆగస్టు 11 : నాయుడుపేట అర్బన్ సీఐగా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న శ్రీనివాసులురెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. ఆదివారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన అర్బన్ సీఐ బాబీ, ఎస్ఐ గోపీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు

డీఎస్పీగా రమణకుమార్ బాధ్యతల స్వీకారం


డీఎస్పీ వి.వి.రమణకుమార్

గూడూరు, ఆగస్టు 11: డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపడుతానని డీఎస్పీ వి.వి.రమణకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేరాల నియంత్రణకు పోలీసులు నిరంతరం పనిచేస్తూ ఉంటారన్నారు. బేసిక్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇస్తామన్నారు. పోలీసులు యూనిఫాం ధరించి రోడ్లపై తిరుగుతుంటే నేరాలు తగ్గుముఖం పడుతాయన్నారు. ప్రధానంగా గంజాయి అక్రమ రవాణాను అరికట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరిని ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం డివిజన్ పరిధిలోని పలువురు సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది డీఎస్పీని కలసి శుభాకాంక్షలు తెలిపారు.

గూడూరు పట్టణ సీఐగా శేఖర్‌బాబు ...



గూడూరు, ఆగస్టు 11: ఒకటో పట్టణ సీఐగా శేఖర్‌బాబు ఆదివారం స్థానిక ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తుండిన సీఐ పాపారావు బదిలీపై గుంటూరుకు వెళ్లడంతో ఆయన స్థానంలో గుంటూరు వీఆర్‌నుంచి వచ్చిన శేఖర్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణంలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు చర్యలు చేపడుతామన్నారు. నేర నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అనంతరం పలువురు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వెంకటగిరి సీఐగా రమణ...



వెంకటగిరిటౌన్, ఆగస్టు 11: వెంకటగిరి సీఐగా ఏవీ రమణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఒంగోలు డీసీ కార్యాలయంలో పనిచేశారు. రెగ్యులర్ బదిలీల్లో భాగంగా వెంకటగిరికి వచ్చారు.

వాకాడు సీఐగా ....

వాకాడు, ఆగస్టు 11: వాకాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా హెచ్ఎస్ హుస్సేన్ బాషా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు సోషల్ మీడియా, సైబర్ క్రైం సెల్ లో ఉన్న ఆయన సాధారణ బదిలీల్లో వాకాడు సీఐగా వచ్చారు. ఈ సందర్భంగా సీఐకు పలువురు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లాకు చేరిన ఎంపీడీవోలు

- 18మందికి పూర్వపు మండలాల్లోనే పోస్టింగులు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 11: సార్వత్రిక ఎన్నికల విధుల కోసం ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన ఎంపీడీవోలు ఆదివారం తిరుపతి జిల్లాకు చేరుకున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం ఇక్కడికి వచ్చిన ఎంపీడీవోలు శనివారం సాయంత్రం రిలీవ్ అయి సొంత జిల్లాలకు వెళ్లిపోయారు. తిరుపతి జిల్లాలోని 18మంది ఎంపీడీవోలకు వారి పూర్వపు మండలాల్లోనే పోస్టింగ్ ఇచ్చారు. నెల్లూరు జిల్లా ప్రజాపరిషత్ పరిధిలోని పలు మండలాలకు సీఈవో కన్నమ నాయుడు పోస్టింగ్స్ ఇచ్చారు. బి.సింగయ్య(దొరవారిసత్రం), కె.వెంకటేశ్వరరావు(గూడూరు), వి.వి.సూర్యసాయి(చిల్లకూరు), ఎం.భవాని(కోట), కె.షాలెట్(చిట్టమూరు), కె.సురేష్‌బాబు(పెళ్లకూరు), పి.ప్రసన్నకుమారి(డక్కిలి), ఎ.ప్రమీలారాణి(సూళ్ళూరుపేట), వి.రజనీకాంత్(ఓజిలి), కేవీ వెంకటేశ్వరరావు(వెంకటగిరి)లను నియమించారు. ఉమ్మడి చిత్తూరు జడ్పీ పరిధిలోని పలు మండలాలకు జడ్పీ సీఈవో గ్లోరియా ఎంపీడీవోలకు పోస్టింగ్స్ ఇచ్చారు. అందులో భాగంగా పి.భానుమూర్తిరావు(వడమాలపేట), పీఎంఆర్ ప్రభాకర్(పాకాల), కె.సురేష్‌బాబు(తొట్టంబేడు), కనకం శ్రీనివాసులు(ఆర్‌సీపురం), పి.సాయిలహరి(బీఎన్‌కండ్రిగ), కె.రామచంద్ర(కేవీబీపురం), ఎ.అమర్‌నాథ్(యర్రావారిపాళెం), బి.బాలాజీనాయక్(చంద్రగిరి)లను నియమించారు. పోస్టింగ్స్ వచ్చిన ఎంపీడీవోలు తక్షణం విధుల్లో చేరాలని ఆదేశాలు ఇచ్చారు. ఇటీవల పలువురు ఎంపీడీవోలు పదవీ విరమణ చెందారు. వారికి కూడా ఆ స్థానాలను భర్తీ చేయాల్సి ఉంది.

16న తిరుమలలో ఛత్రస్థాపనోత్సవం

తిరుమల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని నారాయణగిరి శ్రీవారిపాదాల చెంత ఈనెల 16వ తేదీన ఛత్రస్థాపనోత్సవం జరగనుంది. ఈసందర్భంగా అర్చక బృందం శ్రీవారి పాదాలకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించిన గొడుగును ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. ఏడాదికోసారి ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తిరుమల ఏడుకొండల్లో అత్యంత ఎత్తయిన నారాయణ గిరి శిఖరంపై కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామి మొదటిగా కాలు మోపినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా శ్రావణ శుద్ధ ద్వాదశినాడు ఛత్రస్థాపనోత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవానికి మరో నమ్మకం కూడా ఉంది. నారాయణగిరి శిఖరం ఎక్కువ ఎత్తులో ఉండడంతో ఎక్కువగా గాలులు వీస్తాయి. ఈ గాలుల నుంచి ఉపశమనం కల్పించాలని వాయుదేవుడిని ప్రార్థిస్తూ ఇక్కడ గొడుగును ప్రతిష్ఠిస్తారు. నారాయణగిరిలోని శ్రీవారిపాదాలకు తిరుమంజనం నిర్వహించేందుకు ఆలయంలోని బంగారు బావి నుంచి తీర్థాన్ని తీసుకుంటారు. శ్రీవారి ఆలయంలో రెండో గంట తర్వాత పూజా సామగ్రి, పుష్పాలు, నైవేద్యానికి ప్రసాదాలు సిద్ధం చేసుకుంటారు. రంగనాయకుల మండపం నుంచి గొడుగులతో మంగళవాయిద్యాల నడుమ మహాప్రదక్షిణంగా మేదరమిట్ట వద్దకు చేరుకుంటారు. అక్కడినుంచి అర్చకులు నారాయణగిరి శిఖరం చేరుకుని తీర్థంతో శ్రీవారిపాదాలకు తిరుమంజనం నిర్వహించి, అలంకారం, పూజ, నైవేద్యం సమర్పిస్తారు. తదనంతరం వేద పారాయణదారులు ప్రబంధ శాత్తుమొర నిర్వహించి, శ్రీవారి పాదాల చెంత గొడుగును ప్రతిష్ఠించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తారు.

ఇక ప్రగతి బాటలో గ్రామాలు

- ఉపాధి హామీ నిధుల తోడ్పాటు
- సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణాలు
- కూటమి ప్రభుత్వం రాకతో మౌలిక వసతుల కల్పనకు కృషి


గత టీడీపీ హయాంలో కేసియన్‌గుంటలో నిర్మించిన సిమెంటు రోడ్డు

సూళ్లూరుపేట, ఆగస్టు 11: పల్లెలు ప్రగతి బాట పట్టాలంటే మౌలిక వసతుల కల్పన ముఖ్యం. వీటిలో రోడ్లు, కాలువలు ప్రధానమైనవి. ఈ కారణంగా టీడీపీ హయాంలో ఉపాధి హామీ నిధులతో ఆయా పనులకు ప్రాధాన్యమిచ్చారు. దాదాపు అన్ని గ్రామాల్లో ప్రధాన మార్గాలను సిమెంట్ రోడ్లుగా తీర్చిదిద్దారు. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటిని విస్మరించడంతో పాటు.. ఆర్థిక సంఘ నిధులనూ పక్కదారి పట్టించడంతో గ్రామీణ ప్రగతి పడకేసింది.

స్థానికంగా పనులు...

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కూలీలకు స్థానికంగా పనులు కల్పించడంతోపాటు పంచాయతీలకు ఆస్తులు ఉండాలన్న ఉద్దేశంతో.. ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్లు, ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణం చేపట్టింది అప్పట్లో 70 శాతం మెటీరియల్, మరో 30 శాతం నిధులు పంచాయతీల నుంచి వెచ్చించేవారు. ఆ తరువాత 50 శాతం మెటీరియల్, మిగతా యాభై శాతం స్పెషల్ డెవలెప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్) కేటాయించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎస్‌డీఎఫ్ నిధుల ఊసేలేదు. టీడీపీ హయాంలో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు ఎంత మొత్తం నిధులు ఖర్చు చేశారో.. అందులో నలభై శాతం నిధులు మెటీరియల్ కాంపొనెంట్ కింద సమకూరేవి. పల్లె రోడ్ల అభివృద్ధికి తొలి ప్రాధాన్యమిచ్చి ఆ మొత్తం ఖర్చు చేశారు. తరువాతి ప్రాధాన్యంగా పంచాయతీ భవనాలు, శ్మశాన వాటికల అభివృద్ధి, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు ప్రహరీ, రైతు బజార్లు, తీర ప్రాంత గ్రామాల్లో చేపల మార్కెట్ నిర్మాణం వంటివి చేపట్టారు.

ఆర్థిక సంఘం నిధులూ లాగేసుకుని..

వైసీపీ ప్రభుత్వం వచ్చాక పల్లె ప్రగతి పడకేసింది. పంచాయతీలకు కేంద్రం నుంచి వచ్చిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను సైతం లాగేసుకుంది. విద్యుత్ బిల్లుల బకాయిల కింద జమ చేసుకోవడంతో ఖాతాలు ఖాళీ అయ్యాయి. కొన్ని పంచాయతీల్లో పారిశుధ్య పనులూ నిర్వహించలేని పరిస్థితుల్లో కొందరూ సర్పంచులే సొంత నిధులు వెచ్చించిన ఘటనలున్నాయి. వైసీపీ హయాంలో గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన సమస్యల పరిష్కానికి ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున కేటాయించారు. పలు చోట్ల అంతర్గత రోడ్ల నిర్మాణానికి ఆ నిధులు కేటాయించినా.. బిల్లులు రావన్న భయంతో పనులు చేపట్టేందుకు ఆ పార్టీ నాయకుల సైతం అనాసక్తి చూపారు.

కూటమి ప్రభుత్వం రాకతో...

వైసీపీ ఐదేళ్ల పాలనలో పడేసిన పల్లె ప్రగతిని మళ్లీ పట్టాలెక్కించడానికి కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. గ్రామాల వీధుల్లో మురుగు లేకుండా, మట్టి రోడ్డు లేని పల్లెలుగా చేయాలనే ఉద్దేశంతో మళ్లీ పల్లెలకు మహర్దశ పట్టనుంది. ఉపాధి హామీ నిధులతో పల్లెల్లో సిమెంటు రోడ్ల నిర్మాణంతోపాటూ పారిశుధ్యం తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనుంది. ఇందుకోసం సూళ్లూరుపేట నియోజకవర్గంలో తొలి విడతగా రూ.12 కోట్లు మంజూరు చేశారు. ప్రతి మండలానికి రూ.2 కోట్లు కేటాయించారు. నియోజకవర్గంలో 6 మండలాల్లో 127 పంచాయతీలున్నాయి. ఇక ఈ పంచాయతీల్లో మట్టి రోడ్లు సిమెంటు రోడ్లుగా మారి మురుగునీరు నిల్వలేకుండా పల్లెలు సుందరంగా దర్శనమివ్వనున్నాయి. గడిచిన ఐదేళ్లలో వీధి లైట్ పోతే వేసుకోలేని పరిస్థితి. కరెంట్ బిల్లులు చెల్లించలేని దుస్థితి. ప్రస్తుతం నిధులు కేటాయించడంతో రూపురేఖలు మారనున్నాయి.

ఊపందుకున్న వరి కోతలు

- ఖరీఫ్‌లో 2 వేల ఎకరాల్లో వరిసాగు
- పెరిగిన పెట్టుబడులు
- తగ్గిన దిగుబడులు.. తప్పని నష్టాలు


చిల్లకూరులో పంట కోస్తున్న వరి కోత యంత్రం

పెళ్లకూరు, ఆగస్టు 11 : ఈ ఖరీఫ్ సీజన్‌లో మండలంలో సుమారు 2 వేల ఎకరాలకు పైగా రైతులు వరి సాగు చేపట్టారు. అడపాదడపా కురిసిన వర్షాలతో పాటు బోర్ల కింద ఎంటీయూ 1010 రకం సాగు చేశారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో వరికోతలు ఊపందుకున్నాయి. అయితే ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పంటను చీడపీడలు ఆశించడంతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. గతేడాది ఇదే సీజన్‌లో ఎరకానికి 40 నుంచి 45 బస్తాలు దిగుబడులు రాగా ఈ ఏడాది 30 నుంచి 35 బస్తాలే వస్తున్నాయి.

పెరిగిన పెట్టుబడి...

వాస్తవానికి ఖరీఫ్‌లో సాగుచేసే వరికి చీడపీడల ఆశించే పరిస్థితి చాల తక్కువ. దుక్కినుంచి కోతల వరకు ఎరకానికి సుమారు రూ.35 వేలు ఖర్చు అవుతాయి. అలాంటిది ఈ ఏడాది చీడపీడలు ఆశించడంతో పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గడం రైతులను నిరాశ పరిచింది. ఇదిలా ఉండగా కోతలు ఊపందుకున్న నేపథ్యంలో దళారులు, వ్యాపారులు, మిల్లర్లు కుమ్మక్కై ధరలు పెరగకుండా చూసుకుంటున్నారు. ఎంటీయూ 1010 రకం ధాన్యం ధర గతేడాది రూ.1550 వరకు పలికింది. ప్రస్తుతం రూ.1480 ఉన్న ధర నేడు రూ.1440కి చేరింది. దీనికి తోడు 75 కిలోల బస్తాకి నెమ్ము పేరుతో మూడు కిలోలు, గోనెసంచికి కిలో, రివాజు పేరుతో అర కిలో కలిపి మొత్తం నాలుగన్నర కిలోలు తగ్గిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యానికి ఆశించిన స్థాయిలో ధరలు లేకపోవడంతో పెట్టుబడులు సైతం రాక రైతులు నష్టాలు పాలవుతున్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి సిండికేట్‌లపై చర్యలు తీసుకుని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నిర్వీర్యమైన చెత్తనుంచి సంపద కేంద్రాలు

పట్టించుకోని అధికారులు ● నిష్ఫలమైన కోట్లాది రూపాయలు


నిరుపయోగంగా మానమాల చెత్తనుంచి సంపద కేంద్రం

ఓజిలి, ఆగస్టు 11 : చెత్తనుంచి సంపద అనే నినాదంతో ఏర్పాటైన కేంద్రాలు నిర్వీర్యమై పోయాయి. దీంతో కోట్లాది రూపాయల నిధులు నిష్ఫలమయ్యాయి. సూళ్లూరుపేట నియోజకవర్గంలో 100కు పైగా చెత్తనుంచి సంపద కేంద్రాలు ఉన్నాయి. ఈక్రమంలో ఒక్కో కేంద్రం నిర్మాణం కోసం రూ.3.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు నిధులను వెచ్చించి నిర్మించారు. 2014-19 మధ్యలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చెత్తనుంచి సంపద కేంద్రాలకు బీజం పడింది. ఓ వైపు పారిశుధ్య సమస్య పరిష్కారంలో భాగంగా సేకరించిన తడి, పొడి చెత్తనుంచి సంపద సృష్టించేందుకు సంకల్పించిన ఈ పథకం పలు గ్రామాల్లో చెత్త సమస్యకు పరిష్కారం చూపుతున్న తరుణంలో ప్రభుత్వం మారడంతో మొదటికి వచ్చింది. అప్పట్లో ఉపాధి హామీ పథం కింద నిధులను వ్యయం చేసి ఈ కేంద్రాల నిర్మాణం జరిగింది. ఓజిలి మండలంలోని 26 పంచాయతీల్లో 17 చెత్తనుంచి సంపద కేంద్రాల నిర్మాణం పూర్తి చేశారు. మరో 7 పంచాయతీలలో వీటి నిర్మాణం వివిధ దశల్లో ఉంది. కాగా మండలంలోని తిరుమలపూడి, గ్రద్దగుంట పంచాయతీలలో వీటి నిర్మాణం చేట్టలేదు.

గ్రామాలను వీడని చెత్త సమస్య...

కేంద్ర ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుని ఎంతో ఉన్నతాశయంతో ప్రారంభమైన ఈ పథకం టీడీపీ ప్రభుత్వం మారడంతో 2019-24 మధ్యకాలంలో పూర్తిగా నిర్వీర్యమైపోయింది. అటు ప్రభుత్వం, ఇటు అధికారులు ఈ కేంద్రాలను పట్టించుకోలేదు. టీడీపీ హయాంలో గ్రామాల్లో చెత్త సేకరణ కోసం నియమించిన గ్రీన్ అంబాసిడర్లను సైతం వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. దీంతోపాటు పంచాయతీలకు మంజూరైన నిధులను సర్పంచుల ప్రమేయం లేకుండా వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించడంతో పారిశుధ్యం సమస్య జటిలంగా మారింది. ఈ కేంద్రాల ద్వారా సంపద సృష్టించే మాట ఎలా ఉన్నా ప్రస్తుతం ఇవి అసాంఘిక కార్యకలాపాలకు చక్కగా ఉపయోగపడుతున్నాయి. మూలన పడిపోయిన ఈ సంపద కేంద్రాలపై టీడీపీ ప్రభుత్వం దృష్టి సారించి తిరిగి వినియోగంలోని తీసుకురావాల్సి ఉంది.

టీటీడీలో ఏ పనీ మా సొంత నిర్ణయం కాదు

- ఏరోజు ఏ దుర్వార్త వినాల్సి వస్తుందోనని భయమేస్తోంది
- నోటీసులు వెనక్కి తీసుకునేలా చర్యలు తీసుకోండి
- ఎమ్మెల్యే ముందు ఇంజనీరింగ్ ఉద్యోగుల ఆవేదన


ఎమ్మెల్యే ఆరణి వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

తిరుమల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): 'టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలో దాదాపు 30 ఏళ్లుగా మేము విధులు నిర్వహిస్తున్నాం. ఎన్నడూ ధార్మిక సంస్థకు చిన్నపాటి మచ్చ కూడా రానీయకుండా పైఅధికారుల ఆదేశాలకు అనుగుణంగా పనిచేశాం. ఎప్పుడూ స్వలాభాపేక్షకు తావు ఇవ్వలేదు. టీటీడీలో ఏఒక్క పనీ మా సొంత నిర్ణయం కాదు. టీటీడీ ఈవో, బోర్డు నిర్ణయాల మేరకు పనులు చేశాం. అటువంటిది మూడ్రోజులుగా ఇంజనీరింగ్ విభాగంలో దాదాపు 50 మందికిపైగా స్టేట్ విజిలెన్స్ నోటీసులు జారీ చేసింది. వాటిని వెంటనే వెనక్కి తీసుకునేలా చర్యలు తీసుకోండి' అంటూ టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే పలువురు ఉద్యోగులు ఆదివారం తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముందు ఆవేదన వ్యక్తం చేస్తూ వినతిపత్రమిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలోని టీటీడీ ధర్మకర్తల మండలి, ఈవో రాజకీయ ప్రయోజనాల కోసం టీటీడీ నిధులు దుర్వినియోగం చేశారని, కమీషన్ల కోసం వందల కోట్ల రూపాయలను ఇంజనీరింగ్ పనులకు కేటాయించారనే ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై నూతన ప్రభుత్వం స్టేట్ విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. వారు దాదాపు రెండు నెలల పాటు విచారణ జరిపి మూడు, నాలుగు రోజులుగా ఇంజనీరింగ్ విభాగంలోని అధికారులు, ఉద్యోగులకు నోటీసులు జారీ చేశారు. ఈక్రమంలో కొంతమంది ఉద్యోగులు శనివారం పెన్‌డౌన్‌తో నిరసన కూడా వ్యక్తం చేసినట్టు సమాచారం. కాగా, టీటీడీ ఏఈ వీరప్రసాద్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ శివరామకృష్ణ ఇలా దాదాపు 50 మందికిపై ఆరణిని కలిసి తమ బాధను తెలియజేశారు. ఈవో, బోర్డు తీర్మానాలను తాము అమలుచేయాలని, లేకుంటే సర్వీస్ రూల్స్ ప్రకారం పైఅధికారుల ఆదేశ ధిక్కరణ కింద క్రమశిక్షణ చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇన్నేళ్లపాటు శ్రీవారిపై భక్తి, నమ్మకం, నిస్వార్థంతో విధులు నిర్వహించామన్నారు. నాలుగైదు ఏళ్లలో పదవీ విరమణ చేయబోతున్న తమ మానసిక ధృఢ సంకల్పాన్ని దెబ్బతీసేలా నోటీసులు అందుకోవడం బాధాకరమన్నారు. విధి నిర్వహణలో ఎన్నోసార్లు అవార్డులు తీసుకున్న తాము ప్రస్తుతం రివార్డులు అందుకోవడం బాధను కలిగిస్తోందన్నారు. తప్పుచేస్తే శిక్షణ అనుభవించాలని కానీ పరిధుల మేరకు విధులు నిర్వహించినప్పటికీ నోటీసులు తీసుకోవడం ఏమాత్రం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు అందరికీ బీపీ, షుగరు వ్యాధులున్నాయని, ఈక్రమంలో ఏరోజు ఏవార్త వినాల్సి వస్తోందోననే భయంగా ఉద్యోగం చేసే పరిస్థితికి వెళ్లిపోతున్నామన్నారు. మానసికంగా తాము కుంగిపోకుండా న్యాయం చేయాలని కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే స్పందిస్తూ.. కావాలని తప్పు చేస్తే శిక్ష పడుతుందే తప్ప, విధి నిర్వహణలో భాగంగా ఏదైనా పొరబాటు ఉంటే వీలైనంతవరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్

- స్కూటరిస్టు మృతి


మస్తాన్ మృతదేహం

తడ, ఆగస్టు 11: ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. మండల పరిధిలోని భీములవారిపాళేనికి చెందిన టి.మస్తాన్ (25) శ్రీసిటీ సెజ్‌లో పనిచేస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి సూళ్లూరుపేటలో పెళ్లికి వెళ్లేందుకు తన స్నేహితుడు పెరియవట్టుకుప్పానికి చెందిన షాదిక్‌తో కలసి ద్విచక్రవాహనంపై వెళ్లారు. మార్గమధ్యంలో పులివేంద్ర సమీపంలోని జాతీయ రహదారి మలుపు వద్ద ట్రాక్టర్ దూసుకువచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈప్రమాదంలో మస్తాన్ అక్కడికక్కడే మృతి చెందగా షాదిక్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు సమాచారం మేరుకు 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అతన్ని చెన్నైకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళమ్మకు ప్రత్యేక పూజలు



గూడూరు అర్బన్, ఆగస్టు 11: గూడూరు గ్రామదేవత తాళమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణ, సమీప ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు.

తిరుపతినుంచి పలు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 11: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా తిరుపతి నుంచి ఐదు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. ఈ నెల 14న తిరుపతి - నాగర్‌సోల్‌ల మధ్య ప్రత్యేక రైలు(07417) ఉదయం 8.15 గంటలకు బయలుదేరి రేణిగుంట, కోడూరు, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, ముద్దనూరు, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూర్, యాదగిరి, చిట్టపూర్, తాండూర్, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాదు, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్, నాండేడ్, పూర్ణా, పర్భాని, సెలు, పార్టూర్, జాల్నా, ఔరంగాబాద్‌ల మీదుగా మరుసటిరోజు ఉదయం 10 గంలకు నాగర్‌సోల్‌కు చేరుకొంటుంది. నాగర్‌సోల్‌లో ఈ ప్రత్యేక రైలు(07418) 15వ తేది రాత్రి 10 గంటలకు బయలుదేరి, వెళ్లిన మార్గంలోనే ప్రయాణిస్తూ మరుసటి రోజు రాత్రి 10.30 గంటలకు తిరుపతికి చేరుకొంటుంది. అదేవిధంగా తిరుపతి - సికింద్రాబాదు మధ్య 17వ తేది ప్రత్యేక రైలు(07489) సాయంత్రం 5.15 గంటలకు బయలుదేరి రాయలసీమ ఎక్స్‌ప్రెస్ మార్గంలో ప్రయాణిస్తూ మరుసటి రోజు ఉదయం 7.25 గంటలకు సికింద్రాబాదుకు చేరుకొంటుంది. సికింద్రాబాదులో ఈ ప్రత్యేక రైలు(07490) 18వ తేది సాయంత్రం 6.10 గంటలకు బయలుదేరి వెళ్లిన మార్గంలోనే ప్రయాణిస్తూ మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతికి చేరుకొంటుంది. అలాగే తిరుపతి నుంచి నాందేడ్‌కు 19వతేది సాయంత్రం 5.15 గంటలకు ప్రత్యేక రైలు(07417) బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయంరోడ్డు, రాయచూర్, క్రిష్ణ, యాదగిరి, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాదు, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్, ముడికేడ్ స్టేషన్లలో ఆగుతూ మరుసటి రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు నాందేడ్‌కు చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సీపీఆర్‌వో విజ్ఞప్తి చేశారు.

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా: టీడీపీ

చిట్టమూరు, ఆగస్టు 11: గత స్థానిక సంస్థ ఎన్నికల్లో వైసీపీకి ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా అని తిరుపతి పార్లమెంట్ టీడీపీ ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు ఎన్ఆర్‌వి కృష్ణ ప్రశ్నించారు. సోషల్ మీడియాలో వైసీపీ మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి చేస్తున్న ప్రకటనలపై ఆయన ఆదివారం స్పందించారు. ఈనెల 8న జరిగిన విద్యా కమిటీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని టీడీపీ ఖూనీ చేసిందన్న ఆయన ప్రకటనను ఖండించారు. విద్యా కమిటీ ఎన్నికల్లో విద్యార్థుల తల్లిదండ్రులను టీడీపీకి మద్దతు పలకుండా చేసి ప్రలోభపెట్టాలని చూసిన వైసీపీకి తగిన స్థాయిలో బుద్ధి చెప్పారన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ సానుభూతిపరులను భయపెట్టి పోటీ చేయకుండా చేసిన నైజం వైసీపీది కాదా అన్నారు. తాను చిట్టమూరు మండల జట్పీటీసీగా పోటీ చేస్తే తనకు కరోనా వచ్చిందని, ఆస్ట్రేలియాకు తిరిగి పంపేందుకు చేసిన ప్రయత్నాలు మరచిపోయారా అని ప్రశ్నించారు. కుట్రలు, కుటంత్రాలు చేయడం వైసీపీకి వెన్నతో పెట్టిన విద్య అని, అందుకే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించి 11 సీట్లిచ్చారన్నారు. ఎన్డీఏ కూటమిలో సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం వైపు పరుగులు పెట్టిస్తున్నారన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 11: తిరుపతి ఎస్వీయూనివర్సిటీ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. వర్సిటీ సీఐ మురళీమోహన్ తెలిపిన వివరాలు... సుమారు 45 సంవత్సరాల వ్యక్తి గత కొంతకాలంగా తిరుపతి - చంద్రగిరి ఫ్లైఓవర్ సమీపంలో, విద్యానగర్ క్రాస్ వద్ద, స్థానిక పెట్రోలు బంకు వద్ద తచ్చాడుతుండే వాడన్నారు. ఆయన ఆదివారం మృతి చెందాడన్నారు. అతడి శరీరంపై ఎలాంటి గాయాలు లేవని, ఆరోగ్యం సరిగా లేక మృతి చెందాడా లేక అతిగా మద్యం తాగి మృతి చెందాడా అనే వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహంపై బ్లూరంగు షర్టు ఉండగా, దానిపై 984 గుడ్ అని ఇంగ్లీషులో రాసి వుంది. మృతుడి వివరాలు తెలిస్తే సెం.94910 74524కు అవసరమైన సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఆ హాట్ సీట్లపైనే పలువురు సీఐల ఆసక్తి

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 11: జిల్లాలో సీఐల బదిలీలు రెండుసార్లు జరిగినా కొన్ని స్థానాలపై పలువురు సీఐలు ఆసక్తి చూపుతున్నారు. వీటిల్లో తిరుపతి ఈస్ట్, తిరుమల వన్‌టౌన్, టూటౌన్, తిరుపతి వెస్ట్, చంద్రగిరి, పాకాల, భాకరాపేట సర్కిళ్లను హాట్ సీట్లుగా పోలీసు వర్గాలు భావిస్తుంటాయి. వీటిల్లో ఒక్కో సర్కిల్‌కి దాదాపు నలుగురు చొప్పున పోటీపడుతున్నట్లు సమాచారం. అత్యంత డిమాండు ఉన్నది ఈస్ట్ సర్కిల్. దీని పరిధి కూడా ఎక్కువే. పైగా విద్య, వైద్యంతోపాటు వ్యాపార కేంద్రం కూడా కావడంతో పోటీ ఎక్కువగా ఉంది. తిరుమలకూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడా పోటీ తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో ఎవరికి పోస్టింగ్ ఇవ్వాలన్న దానిపై అధికారులకు తలనొప్పిగా మారింది. కాగా, అనధికార సమాచారం మేరకు.. తిరుపతిలోని ఎస్వీయూనివర్సిటీ సీఐగా పనిచేస్తున్న మురళీమోహన్‌కు తిరుమల టూటౌన్ ఖరారైనట్లు తెలుస్తోంది. కొండపై వన్‌టౌన్ సీఐగా ఉన్న విజయకుమార్‌కు బదిలీ లేనట్లు సమాచారం.

రమేష్ చంద్రప్రసాద్‌కు పలువురి నివాళి

నింద్ర, ఆగస్టు 11: ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు గంధమనేని రమేష్‌చంద్ర ప్రసాద్‌కు పలువురు నేతలు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఆయన స్వగ్రామమైన నింద్ర మండలం ఉరూరుపేటలో ఆదివారం కర్మక్రియలు జరిగాయి. ఈ సందర్భంగా సంతాప సభ నిర్వహించారు. టీడీపీకి రమేష్‌చంద్ర ప్రసాద్ చేసిన సేవలను పలువురు ఎమ్మెల్యేలు, నేతలు గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆయనకు పుష్పాంజలి ఘటించిన వారిలో మాజీ మంత్రి కరణం బలరాం, నగరి, సత్యవేడు ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాష్, ఆదిమూలం, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీనివాసులు, జయచంద్ర నాయుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, నేతలు ఎస్సీవినాయుడు, నేతలు చంద్రప్రకాష్, అశోక్‌రాజు, ఆర్సీ మునికృష్ణ, ఎంఎం రాధాకృష్ణ, చినబాబు, ప్రకాష్‌నాయుడు, పాకారాజా, వెంకటేశ్వరరావు, ధనంజయనాయుడు, దశరథవాసు, గాలి రమేష్‌నాయుడు, ఢిల్లీబాబు, గంగాధరం నాయుడు, ధనంజయయాదవ్, ధనంజయనాయుడు, లక్ష్మీపతిరాజు, గిరి, మురళీనాయుడు, రవికుమార్, గిరిబాబు, శివక్రిష్ణమ నాయుడు, పీఎస్. రాధాకృష్ణ, గజేంద్రనాయుడు, చంద్ర, రమేష్, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


రమేష్‌చంద్ర ప్రసాద్ చిత్రపటం వద్ద నాయకులతో కలిసి నివాళి అర్పిస్తున్న నగరి, సత్యవేడు ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాష్, ఆదిమూలం

సీఐల బాధ్యతల స్వీకారం



సీఐలు గోపి, శరత్‌చంద్ర, మురళీకృష్ణ, మురళి

శ్రీకాళహస్తి/రేణిగుంట/సత్యవేడు, ఆగస్టు 11: శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐగా గోపి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. రెండు రోజుల క్రితం ఇక్కడ పనిచేసిన సీఐ నరసింహారావును తిరుపతి ఎస్పీ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో కర్నూలు ఎస్పీ కార్యాలయం నుంచి వచ్చిన సీఐ గోపిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్న అనంతరం సీఐ గోపి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. అలాగే రేణిగుంట అర్బన్ సీఐగా శరత్‌చంద్ర, గాజులమండ్యం సీఐగా మురళీకృష్ణ బాధ్యతలు స్వీకరిం చారు. అదేవిధంగా సత్యవేడు సీఐగా ఎం.మురళి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎస్ఐలు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సింహ వాహనంపై ధర్మరాజు విహారం



ధర్మరాజస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, ఆగస్టు 11: నారాయణవనం మండలంలో వెలిసిన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు సింహవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు చేసి, ప్రత్యేక పుష్పాలంకరణ నిర్వహించారు. సాయంత్రం భక్తిశ్రద్ధలతో భక్తులు అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. అనంతరం ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి సింహ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామిని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, జడ్పీటీసీ సుమన్‌కుమార్ దర్శించ కున్నారు. వారికి ఆలయ నిర్వాహకులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అంద జేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కరన్, గోవిందస్వామి, ఏకాంబరం, ఊరప్ప, రవి, హరి, వేలురెడ్డి, మోహన్, రామలింగం, శేఖర్, మురుగేషన్, సుబ్రహ్మణ్యం, ఆలయ పర్యవేక్షకుడు నాగరాజు పాల్గొన్నారు.

భూత వాహనంపై కల్యాణ వీరభద్రస్వామి



నారాయణవనం, ఆగస్టు 11: నారాయణవనం మండలంలో వెలిసిన భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారు భూత వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారిని నిత్య పూజాలు నిర్వహించి, స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామిని భూత వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి నాగరాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో తెలంగాణ ఉపముఖ్యమంత్రి



ధ్వజస్తంభం వద్ద తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

శ్రీకాళహస్తి, ఆగస్టు 11: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

గంగమ్మకు పాలాభిషేకం

రేణిగుంట, ఆగస్టు 11: జాతరను పురస్కరించుకుని రేణిగుంట గంగమ్మకు 1,008 బిందెలతో భక్తులు పాలాభిషేకం చేశారు. ఆదివారం నడివీధి శూలం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి పాలబిందెలతో ఓంశక్తి భక్తులు గంగమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సోలా మల్లికార్జునరెడ్డి, మాజీ సర్పంచు జ్యోతి నారాయణ, సదాశివరెడ్డి పాల్గొన్నారు.



గంగమ్మ ఆలయానికి పాలబిందెలను తీసుకెళుతున్న భక్తులు

పుత్తూరు వార్తలు

యాళీ వాహనంపై ద్రౌపదీదేవి



పుత్తూరు టౌన్, ఆగస్టు 11: పట్టణంలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి అమ్మవార్లు యాళీ వాహనంపై ఊరేగారు. ఉదయం అమ్మవారికి క్షీర, గంధ, నారికేళ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. రాత్రి విద్యుత్ దీపాలంకణలతో అమ్మవారిని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమం మాజీ వీఆర్వో కరణం కుమారపిళ్లై సోదరుల ఆధ్వర్యంలో జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో పూడికతీత

పుత్తూరు టౌన్, ఆగస్టు 11: పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని భవానీ నగర్, ఆరేటమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో మురుగు కాలువల్లో పూడికతీత పనులను అధికారులు చేపట్టారు. వర్షాకాలం నేపథ్యంలో పట్టణంలో వర్షపు నీరు ఎక్కువ కాలం వీధుల్లో నిలిచిపోతుండడంతో స్పందించిన అధికారులు పారిశుధ్య పనులను ముమ్మరం చేశారు. పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేన నాయుడు, ఏఈలు, కౌన్సిలర్ కేశవాచారి, పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు పర్యవేక్షించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ఘనంగా అంకాళమ్మ జాతర



ప్రత్యేక అలంకారంలో అంకాళమ్మ

శ్రీకాళహస్తి, ఆగస్టు 11: పట్టణంలోని బస్టాండు సమీపంలో పీవీ రోడ్డులో వెలసిన అంకాళమ్మ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారికి వివిధ రకాల అభిషేకాలు చేశారు. విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కాగా, అంకాళమ్మ అమ్మవారికి మరాఠీ పాళేనికి చెందిన నరసింహారావు జాతర సందర్భంగా బంగారు ముక్కుపుడక అందజేశారు. ఆలయ అర్చకులు వారిని ఆశీర్వదించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయ కుమార్ నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వారికి ఆలయ నిర్వాహకులు అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ



యుద్ధంలో తలపడుతున్న భీమ, బకాసురులు

పిచ్చాటూరు, ఆగస్టు 11: పిచ్చాటూరులో ధర్మరాజస్వామి తిరునాళ్లలో భాగంగా మూడవ రోజు ఆదివారం జరిగిన బకాసుర వధ ఘట్టం అలరించింది. భీమవేషధారి పుర వీధుల్లో ఊరేగుతూ ఇంటింటికి వెళ్లి అన్నం, కూరలు, వివిధ పదార్థాలను సేకరించి బండిపై తీసుకెళ్లడం, సేకరించిన అన్నం మొత్తాన్ని భీముడొక్కడే తినడం, ఖాళీ బండిని బకాసురుడి వద్దకు తీసుకెళ్లడం, అక్కడ యుద్ధంలో బకాసురుడుని భీముడు వధించడం తదితర సన్నివేశాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

కిరాణ దుకాణంలో చోరీ



దుకాణం షెట్టర్ పగులగొట్టిన దొంగలు

రేణిగుంట, ఆగస్టు 11: మండల పరిధిలోని కరకంబాడిలో ఓ కిరాణ దుకాణంలో ఆదివారం చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... కరకంబాడి రైల్వే గేటు సమీపంలో ఓ కిరాణ దుకాణంలో శనివారం అర్ధరాత్రి దొంగలు షట్టర్లను ఇనుపరాడ్లతో పగులగొట్టి లోనికి ప్రవేశించారు. దుకాణంలోని రూ.3వేల నగదు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కాగా, గత వారం కరకంబాడి ప్రధాన రోడ్డులో ఓ ప్రైవేటు ఏటీఎంలో చోరీకి యత్నం విఫలం కావడంతో పక్కనే ఉన్న ఐదు దుకాణాల్లో చోరీ జరిగింది. ఇది మరవకముందే మరో దుకాణంలో చోరీ జరగడం గమనార్హం.

ఉపాధ్యాయుడు రాజేంద్రకు భారత సేవారత్న అవార్డు ప్రదానం



అవార్డును అందుకుంటున్న రాజేంద్ర

ఏర్పేడు, ఆగస్టు 10: ఏర్పేడు మండలం పాపానాయుడు పేట జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న రాజేంద్రకు మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారత సేవారత్న అవార్డు ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్డు సిటీ కల్చరల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ చక్రవర్తి చేతుల మీదుగా రాజేంద్ర అవార్డు అందుకున్నారు.

జాతీయస్థాయి షూటింగ్ బాల్‌పోటీలకు ఏర్పేడు విద్యార్థుల ఎంపిక

ఏర్పేడు, ఆగస్టు 11: చిత్తూరు జిల్లా వికోట ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో షూటింగ్‌బాల్ పోటీలు శనివారం నుంచి ఆదివారం వారకు రెండురోజుల పాటు జరిగాయి. ఇందులో పాల్గొన్న ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న హర్షవర్ధన్, జయవర్ధన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శివకుమార్ తెలిపారు.



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, ఆగస్టు 11: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో పాటు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 25వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,683 మంది, రూ.50 ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,639 మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,247మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 930, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 284మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 234మంది, రూ.5వేల టిక్కెట్ల ద్వారా ఏడుగురు భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 16,508 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ముక్కంటి ఆలయ క్యూలైన్లలో భక్తులు →

సత్యవేడులో కార్డన్ సెర్చ్



గ్రామస్తులను విచారిస్తున్న సీఐ

సత్యవేడు, ఆగస్టు 11: సత్యవేడులో ఆదివారం ఉదయం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పట్టణంలోని శివారు ప్రాంతమైన ఊళవచేనులో సీఐ దివాకర్ రెడ్డి, ఎస్ఐ వీరాంజనేయులు ఆధ్వర్యంలో గ్రామంలో అణువణువూ గాలించారు. రికార్డులు సక్రమంగా లేని పలు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వీరాంజనేయులు మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా సంఘ విద్రోహక చర్యలకు పాల్పడుతున్నా, అనుమానాస్పదంగా తిరుగుతున్నా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరు ప్రయత్నించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కాగా, రిలీవ్‌కు కొద్ది గంటలకు ముందు సీఐ దివాకర్‌రెడ్డి కార్డన్ సెర్చ్ నిర్వహించడం గమనార్హం.

జలకంఠేశ్వరాలయంలో ధ్వజస్తంభ ఆవిష్కరణ

పిచ్చాటూరు, ఆగస్టు 11: మండలంలోని కీళపూడి గ్రామంలో వెలసిన జలకంఠేశ్వరాలయంలో ఆదివారం వేద పండితుల పూజలు, మంత్రోచ్ఛరణల నడుమ నూతన ధ్వజస్తంభం ఆవిష్కరణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదిమూలం ధ్వజస్తంభ ఆవిష్కరణలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం నింద్ర మండలం ఓరూరుపేటలో ఇటీవల మృతి చెందిన టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రమేష్ చంద్రప్రసాద్ కర్మక్రియలకు హాజరయ్యారు. అక్కడ నుంచి పిచ్చాటూరు మండలం గోవర్ధనగిరిలోని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు మాధవులు నాయుడు ఇంట్లో జరిగిన కేశఖండన శుభకార్యానికి హాజరయ్యారు. కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణ, టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ ఇళంగోవన్‌రెడ్డి, నాయకులు చక్రపాణిరెడ్డి, సతీష్ నాయుడు, పద్మనాభరాజు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సత్యవేడు విద్యార్థి ప్రతిభ



రిత్విక్‌ను సన్మానిస్తున్న కరాటే నిర్వాహకులు

సత్యవేడు, ఆగస్టు 11: తమిళనాడు రాష్ట్రం గుమ్మడిపూడిలో నిర్వహించిన కరాటే పోటీల్లో సత్యవేడు మెయిన్ స్కూల్ విద్యార్థి రిత్విక్ యాదవ్ ప్రథమ స్థానంలో నిలిచాడు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం గుమ్మడిపూడిలో అండర్ 16 అంతర్రాష్ట్ర కరాటే పోటీలను నిర్వహించారు. ఇందులో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. కట్టా, కుమిటి విభాగం పోటీల్లో రిత్విక్ ప్రథమ స్థానంలో నిలిచాడు. రిత్విక్‌కు జీకేఎంఐ ఇండియన్ చీఫ్ విల్సన్ రాబర్ట్ బహుమతి అందించి సన్మానించారు.

ముక్కంటి ఆలయ ప్రాంగణంలో సర్పం



శ్రీకాళహస్తి, ఆగస్టు 11: ముక్కంటి ఆలయ ప్రాంగణంలో భారీ సర్పం ప్రవేశించడంతో కలకలం రేగింది. ఆదివారం సాయంత్రం ఆలయంలోని అన్నదాన కేంద్రానికి ఎదురుగా గుడ్డిపింజరి భక్తుల మధ్యలోకి ప్రవేశించింది. భక్తులు భయాందోళనకు గురవడంతో కలకలం రేగింది. వెంటనే కొందరు భక్తులు పామును అక్కడికక్కడే కొట్టి హతమర్చారు.

గ్రామదేవతకు ప్రత్యేక పూజలు



గ్రామదేవతకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

కేవీబీపురం, ఆగస్టు 11: మండల కేంద్రమైన కేవీబీపురంలో వెలసిన గ్రామదేవత సత్తెమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఈ నెల 14న జరిగే గంగజాతరకు చాటింపు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 11: కేరళ వయనాడ్ బాధితుల కోసం మండలంలోని నెలవాయి గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విరాళాల సేకరణ చేపట్టారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్దన్, ఉపాధ్యక్షుడు ధనంజయ్య, ఏపీ రైతు వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు నలుగూరి రమణయ్య, నాయకులు తిరుపాలు, మల్లికార్జున, కేశవులు, వెంకటేశ్వర్లు, కోదండం, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రులకు స్వాగతం



విమానాశ్రయంలో మంత్రులకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

రేణిగుంట, ఆగస్టు 11: రేణిగుంట విమానాశ్రయంలో రాష్ట్ర మంత్రులకు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆదివారం రాత్రి విజయవాడ నుంచి స్పైస్ జెట్ విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రహ్మణ్యం, నాయకులు యశ్వంత్‌రెడ్డి, మనోహరాచారి, చెంగయ్య స్వాగతం పలికారు.

నూతన రకాల సాగుతో మంచి దిగుబడులు

రేణిగుంట, ఆగస్టు 11: నూతన రకాల సాగుతో మంచి దిగుబడులు సాధించవచ్చని రాస్ కృషి విజ్ఞానకేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని గొల్లపల్లెలో రైతులకు నూనత రకాల సాగుతో మంచి దిగుబడులపై అవగాహన కల్పించారు.

నేటి నుంచి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

శ్రీకాళహస్తి/సత్యవేడు, ఆగస్టు 11: తొట్టంబేడు, సత్యవేడు మండల పరిషత్ కార్యాలయాల్లో సోమవారం నుంచి బుధవారం వరకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయా ఎంపీడీవోలు ఐజాక్ ప్రవీణ్, చంద్రశేఖర్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. పంచాయతీ విధులు, బాధ్యతలు, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వాహణ, చెత్త సేకరణ, వర్మీ కంపోస్టు తయారీ, పంచాయతీ అభివృద్ధికి సంబంధించి ప్రణాళిక, ఆర్థిక వనరుల సమీకరణ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

జానపద కళలను కాపాడుకుందాం



కళాకారులను సన్మానిస్తున్న మన సంస్కృతి కళా సంస్థ సభ్యులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 11: జానపద కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా మన సంస్కృతి కళా సంస్థ అధ్యక్షుడు రంగాని సహదేవ నాయుడు అన్నారు. ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రాంగణంలో భజన, భక్తి, జానపద గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెరమరుగవుతున్న నాటి సంస్కృతి, కళారూపాల జానపద గేయాలను, భక్తి, భజన పాటలు నేటి సమాజానికి అందించాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి కలకట రెడ్డెప్ప మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ కార్యక్రమం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తికి సంస్థ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గాయకులను సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య సత్కరించారు. ఈకార్యక్రమంలో రమణమ్మ, వెంకటస్వామి, మునిరామయ్య, రవిబాబు, వెంకటేష్, నాగరాజు, శ్రీనివాస్, నాగమణి, రచయిత ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, కృష్ణయ్య, గుమ్మడి మురళి, గజేంద్రబాబు, రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటిచూపును నిర్లక్ష్యం చేయొద్దు



వైద్యపరీక్షలకు హాజరైన ప్రజలు

వరదయ్యపాళెం, ఆగస్టు 11: కంటిచూపును నిర్లక్ష్యం చేయవద్దని శంకర నేత్రాలయ ప్రతినిధి వెంకటముని అన్నారు. డైనమిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరదయ్యపాళెం మండలం సంతవేలూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల పరీక్షలను, శస్త్రచికిత్సలను తమ సంస్థ ఉచితంగానే చేస్తుందన్నారు. శస్త్రచికిత్స చేయాల్సిన వారికి ప్రయాణ ఖర్చులను తామే భరిస్తామని తెలిపారు. అంధత్వాన్ని పూర్తిగా నిర్మూలించాలని తాము చేస్తున్న సేవను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుమారు 100మంది కంటి వైద్య పరీక్షలను నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ప్రసాద్ రాజేంద్ర, యోగా గురు సురేష్‌నాయుడు, టీడీపీ నాయకులు ఆణిముత్యం నందకిషోర్‌రెడ్డి, చలపతినాయుడు, బాబురెడ్డి, బాలయ్య, డైనమిక్ ప్రతినిధులు బాలకృష్ణ, రామసుబ్బయ్య, మాడస్వామి, సురేష్ రెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగజాతర



జాతరలో పాల్గొన్న భక్తులు

వరదయ్యపాళెం, ఆగస్టు 11: వరదయ్యపాళెం మండలం ఇందిరానగర్ పంచాయతీ పద్మావతి పురంలో ఆదివారం గంగ జాతర వైభవంగా జరిగింది. ఉదయాన్నే గంగమ్మకు పూజలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి అంబళ్లు సమర్పించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద పొంగళ్లుపెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.